ప్రభాత
# సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 25 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 48

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే బాధ్యత నాయకులదే

**హైదరాబాద్:** జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. "రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉంది. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలి"అని సూచించారు.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## ఉగ్రవాదంపై ఉక్కుపాదమే

- ప్రపంచానికి చాటిన సిందూర్
- పాక్‌పై పోరులో మేకిన్ ఇండియా ఆయుధాలు సత్తా చాటాయి
- జాతి ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి చర్యలకైనా తమ సర్కారు వెనకాడే సమస్యే ఉండబోదు
- ప్రధాని నరేంద్ర మోదీ



## మహారాష్ట్ర ఎన్నికల్లో ఓట్ల చోరీ

- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ
- 2024లో లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కేవలం ఆరు నెలల వ్యవధి మాత్రమే ఉందని
- గుర్తు తెలియని వ్యక్తులు ఓట్లేసినట్లు బూత్ స్థాయి అధికారులు నివేదించారు

# 18 నెలల పాలన..
# గోల్డెన్ పీరియడ్



### కార్యకర్తలకు పదవులు ఇప్పించడంలో జాప్యం జరిగితే ఎలా?

- మీరు ఎంపిక చేసి పంపితే కదా... నేను ఫైనల్ చేసేది
- మంత్రులు, పార్టీ నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- కార్యకర్తలను నిరాశకు గురి చేయడం మంచిది కాదు.. ఎవరంటే వారు వచ్చి గాంధీభవన్‌లో ధర్నాలు చేస్తే ఎలా?
- అలాచేస్తే ప్రతిపక్షాల చేతికి ఆయుధాలిచ్చినట్టే.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపు
- హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం బాగా కృషి చేస్తోందన్న మీనాక్షి నటరాజన్
- దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్న పీసీసీ చీఫ్

సూర్య హైదరాబాద్

టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అటు రాష్ట్ర మంత్రులు, ఇటు పార్టీ నేతలపై కాస్త అసహనం వ్యక్తం చేశారు. పార్టీకి కీలకమైన కార్యకర్తలను నిరాశ పరచడం మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వ పదవులను కార్యకర్తలకు ఇప్పించడంలో జాప్యం జరిగితే ప్రయోజనం ఏంటని ప్రశ్నించిన రేవంత్.. దేవాలయాల కమిటీలు, మార్కెట్ కమిటీలు లాంటి పదవులు నేరుగా తాను ఇవ్వలేనని, ఇన్‌చార్జి మంత్రులు షార్ట్‌లిస్ట్ చేసి పంపితే తాను ఫైనల్ మాత్రమే చేయగలనని అన్నారు. నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీ పదవులు ఇవ్వడంలో ఆలస్యం - మిగతా2లో

## 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

- మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం.. ఆ బాధ్యత పార్టీ నేతలదే...
- ఈ పదేళ్లూ అధికార బాధ్యతలు నేను చూసుకుంటా
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి
- పార్టీ నిర్మాణంలో కొత్తగా పదవులు పొందినవారు భాగస్వాములు కావాలని పిలుపు



## నేడు నింగిలోకి యాక్సియం-4

- స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా మధ్యాహ్నం 12 గంటలకు ఈ ప్రయోగం
- పెగ్గీ వాట్సన్ క మాండర్‌గా వ్యవహరించే మిషన్‌లో శుక్లా పైలట్
- ఈ మిషన్ ప్రయోగం మే 29వ తేదీనే చేపట్టాల్సింది

## టైటిల్ వివాదాలు 'సివిల్'లోనే తేల్చుకోవాలి



- భూ వివాదంలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
- హక్కులు, స్వాదీన అంశాలకు అక్కడే పరిష్కారం
- దశాబ్దాల ఆస్తి వివాదంపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

సూర్య హైదరాబాద్

రాజధానిలో దశాబ్దాల నుంచి ఉన్న ఆస్తి వివాదానికి సంబంధించిన రిట్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. తీవ్రమైన టైటిల్ వివాదాల పరిష్కారం కోసం ఆయా వ్యక్తులు సివిల్ కోర్టును ఆశ్రయించాలని ఆదేశిస్తూ పలు పిటిషన్లను కొట్టివేసింది. - మిగతా2లో



## గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ మోగుతోంది

- జనాభాలో 85% మందికి టెలికం సేవలు
- పదేళ్లలో 9 రెట్లు పెరిగిన నెటిజన్ల సంఖ్య
- ఇంటర్నెట్ యూజర్లు 10 కోట్ల నుంచి 94 కోట్లకు
- 2025 ఏప్రిల్‌లో కొత్తగా 30 లక్షల టెలికం కనెక్షన్లు
- ఇందులో మూడింట రెండొంతులు గ్రామీణులే

# చర్చకు రా.. తేల్చుకుందాం!

- గోదావరి- బనకచర్లపై తప్పెవరిదో అసెంబ్లీలో మాట్లాడదాం
- తారీఖు చెప్పి స్పీకర్‌కు లేఖ రాయి.. నేను పూర్తి వివరాలతో వస్తా
- రైతుభరోసా విజయోత్సవ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- పదేళ్ల అధికారంలో ఉండి నదీ జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం



సూర్య హైదరాబాద్

పదేళ్ల అధికారంలో కొనసాగి కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తనపై దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు అసెంబ్లీలో చర్చకు రావా లని సవాల్ విసిరారు. 'నేను చంద్రబాబుతో కలిసిపోయి గోదావరి- బనకచర్లకు నీళ్లిస్తున్నానని దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నావు. - మిగతా2లో



## బనకచర్లపై ఎక్కడైనా చర్చకు సిద్ధం

- 'హామీల గురించి ప్రశ్నిస్తున్నందుకే రేవంత్‌రెడ్డి మాపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు
- మేము సంయమనం పాటిస్తాం.
- రేవంత్‌రెడ్డి.. మీ హామీలు అమలయ్యేదాకా వెంటపడుతూనే ఉంటాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

వివరాలు 2లో..

## ప్రజాస్వామ్యానికి సంకెళ్లు



- ఎమర్జెన్సీ కళంకానికి 50 ఏళ్లు
- అధికారం నిలుపుకొనేందుకు ఇందిర నిర్ణయం
- 21 నెలలపాటు దేశవ్యాప్త దమనకాండ

# 18 నెలల పాలన.. గోల్డెన్ పీరియడ్

-మొదటిపేజీ తరువాయి

జరుగుతోందని, ఇలాంటి చర్యల ద్వారా కార్యకర్తలను నిరాశకు గురిచేయవద్దని చెప్పారు.

వీలున్నంత త్వరగా నామినేటెడ్, పార్టీ పదవుల కోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జాబితాలను పార్టీకి పంపాలని, పార్టీ నుంచి వచ్చిన జాబితాలను పరిశీలించి నామినేటెడ్ పదవులను ఫైనల్ చేద్దామని అన్నారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ పీఏసీ భేటీ జరిగింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌తో పాటు పీఏసీ సభ్యులు ఈ భేటీకి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీల కులగణన, ఎస్సీల వర్గీకరణ, సంస్థాగత నిర్మాణం గురించి చర్చించిన ఈ సమావేశంలో సీఎం రేవంత్.. తనదైన శైలిలో పలు వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం.

**వాళ్లను చూసి ఇంకొకరొస్తారు**

ఎవరంటే వాళ్లు వచ్చి గాంధీభవన్‌లో ధర్నాలు చేస్తే ఆఫీసు నిర్వాహకులు ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తోందంటూ కొందరు యాదవ సంఘాల ప్రతినిధులు గొర్రెలను తీసుకొచ్చి ధర్నా చేయడంపై సీరియస్‌గా స్పందించారు. పార్టీలో ప్రాధాన్యం కావాలని, మంత్రి పదవులు ఇవ్వాలని ఏ సామాజికవర్గానికి చెందిన వారయినా అడగొచ్చని, తనతో పాటు పార్టీ అధ్యక్షుడికి వినతిపత్రాలు ఇవ్వొచ్చని, డిమాండ్ చేయవచ్చని, కానీ ఓ సామాజిక వర్గం పేరుతో వచ్చి గాంధీభవన్‌లో ధర్నా చేయడమేంటని ప్రశ్నించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రతిపక్షాల చేతికి తామే ఆయుధాలిచ్చినట్టు అవుతుందని అన్నారు. ఇప్పుడు వచ్చిన వారిని చూసి రేపు ఇంకొకరు వచ్చి ధర్నా చేస్తారని, ఇలాంటి ధర్నాలకు గాంధీభవన్‌లో అవకాశం ఇవ్వకూడదని అన్నట్టు తెలిసింది.

**ఇన్‌చార్జి మంత్రులు గ్రామాలకు వెళ్లాలి**

క్షేత్రస్థాయిలో ఇన్‌చార్జి మంత్రులు చేయాల్సిన పనులు చేయాలని, లేదంటే గ్రామాలకు వెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే తాను వెళ్లడం వల్ల ఉపయోగం లేదని, గ్రామాలకు వెళ్లాల్సింది ఇన్‌చార్జి మంత్రులేనని స్పష్టం చేశారు. 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా పార్టీ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంస్థాగత నిర్మాణంపై పీసీసీ దృష్టి సారించాలని చెప్పారు.

**'జూబ్లీహిల్స్'పై చర్చ**

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఎన్నిక చాలా కీలకమని, ఈ అంశంపై పార్టీ ఫోకస్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. అయితే కీలకమే కాదని, ఖచ్చితంగా గెలిచి తీరాలని మీనాక్షి స్పష్టం చేశా రు. ఉప ఎన్నికకు పార్టీ సిద్ధం కావాలని, ఆ నియోజకవర్గంలో చేయాల్సిన అన్ని కార్యక్రమాల రోడ్‌మ్యాప్‌ను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తయారు చేయాలని సీఎం సూచించారు. అభ్యర్థిని పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని, తామంటే తాము అభ్యర్థులమని ఎవరూ చెప్పకూడదని పీసీసీ అధ్యక్షుడు ఆదేశించారు.

**మేనిఫెస్టోలో పెట్టలేదు: భట్టి.. కాదు పెట్టాం: శ్రీధర్‌బాబు**

రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టకపోయినా తాము అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అయితే మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..మేనిఫెస్టోలో పెట్టామంటూ పుస్తకం చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బాగానే ఉన్నాయి కానీ, కార్యకర్తలను దృష్టిలో ఉంచుకుని వారికి మేలు చేసే పథకాలు కూడా రూపొందించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పారు. పదవులు, ప్రాధాన్యతలో కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి కంటే ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. సమావేశంలో మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్, పీసీసీ మాజీ అధ్యక్షుడు కె.కేశవరావు తదితరులు మాట్లాడారు. కాగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రాసిన వ్యాసాల సంకలనం 'విధ్వంసం నుంచి వికాసం వైపు'అనే పుస్తకాన్ని రేవంత్, మీనాక్షి ఆవిష్కరించారు.

**'వైఎస్ రచ్చబండ'లాంటి కార్యక్రమం కావాలి**

ప్రభుత్వ పరంగా చేసింది చెప్పుకోలేకపోతున్నామని సీనియర్ నేత జెట్టి కుసుమకుమార్ పీఏసీ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన రచ్చబండ లాంటి కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల కారణంగా ఎవరికి లబ్ధి కలుగుతుంది, ఎవరికి కలగడం లేదనే అంశాలపై గ్రామాల్లోనే చర్చ పెట్టాలని సూచించినట్టు సమాచారం. కాగా పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా అవకాశం లభిస్తుందని మీనాక్షి నటరాజన్ చెప్పారు. ప్రజలకు ఇచ్చిన అన్ని రకాల హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చాలా కృషి చేస్తోందని అభినందించారు. రాష్ట్రంలో గోల్డెన్ పాలన సాగుతోందని, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని మహేశ్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ కూడా తెలంగాణ గురించి ప్రత్యేకంగా చెప్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అన్ని సంక్షేమ కార్యక్రమాల గురించి గణాంకాలతో సహా భట్టి వివరించారు. సమావేశం అనంతరం పీఏసీ నిర్ణయాలను మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి భట్టి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో చేసిన కార్యక్రమాలను పీఏసీ అభినందించిందని, గోల్డెన్ పీరియడ్ అని అభివర్ణించిందని చెప్పారు. బూత్, మండల, జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని, ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రత్యేక కార్యాచరణను ఏర్పాటు చేసుకోవాలని కూడా పీఏసీ నిర్ణయించినట్లు తెలిపారు.

# టైటిల్ వివాదాలు 'సివిల్'లోనే తేల్చుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

అసలైన రికార్డులు లేకపోవడం, పత్రాల ప్రామాణికతకు సంబంధించి విరుద్ధమైన వాదనలు ఉన్నప్పుడు.. అలాంటి వివాదాలను పరిష్కరించడానికి సివిల్ దావానే సరైన మార్గమంటూ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి తీర్పు వెలువరించారు. షేక్‌పేట్ గ్రామం (ప్రస్తుతం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 4) సర్వే నంబర్ 396 (సవరించిన సర్వే నం. 225)లోని ఏడెకరాలకు సంబంధించి దశాబ్దా లుగా వివాదాలున్నాయి. ఈ భూమి తొలుత హైదరాబాద్ మాజీ ప్రధాన మంత్రి (దివాన్) మహారాజా సర్ కిషన్ పెర్షాద్ యాజమాన్యంలో ఉంది. తర్వాత ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో జూబ్లీహిల్స్ గైరా జిరాయట్టి పట్టాగా నమోదై ఉంది. కాగా, మహారాజా కిషన్ పెర్షాద్ చట్టబద్ధమైన వారసులమని చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు 2022లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుత యజమానుల పూర్వీకులకు అనుకూలంగా అమలు చేసిన అమ్మకపు పత్రాలు చెల్లవని పేర్కొన్నారు. అర్బన్ ల్యాండ్ (సీలింగ్, నియంత్రణ) చట్టం%–%1976 కింద పొందిన అనుమతులు మోసపూరితమన్నారు. ప్రస్తుత యజమానులు ప్రెస్టీజ్ గ్రూప్‌నకు అనుకూలంగా అమలు చేసిన డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, జీపీఏని రద్దు చేయాలని కూడా పిటిషనర్లు కోరారు.

**ఈ తీర్పు ప్రభావం ఉండదు..**

ప్రతివాదులైన.. ప్రైవేట్ కొనుగోలుదారులు, రియల్ ఎస్టేట్ సంస్థ (ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్) యూఎల్‌సీ అనుమతుల తర్వాత నాటి హక్కుదారు అసదుల్లా ఖాన్ వారసుల నుంచి చట్టబద్ధంగా భూమిని కొనుగోలు చేశామని వాదించారు. '1937 నాటి రిజిస్టర్డ్ పత్రాల ద్వారా అసలు యజమానుల నుంచి టైటిల్‌ను తెలుసుకున్నాం. యూఎల్‌సీ నుంచి ఆమోదం పొందిన తర్వాత వారు 1980లో భూమిని విక్రయించారు'అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. యూఎల్‌సీ రికార్డులు అందుబాటులో లేవని, వివాదాస్పద ఫొటో కాపీలు మాత్రమే మిగిలి ఉన్నాయని ప్రభుత్వం అంగీకరిస్తోందన్నారు. మోసం ఆరోపణలకు సివిల్ విచారణ అవసరమని.. టైటిల్ వివాదాలు, వారసత్వ సమస్యలను సివిల్ కోర్టే నిర్ణయించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డులు మాత్రమే యాజమాన్యాన్ని ఇవ్వవని తేల్చిచెప్పారు. రిట్ పిటిషన్లను కొట్టివేస్తూ.. పరిష్కారం కోసం సివిల్ కోర్టును సంప్రదించవచ్చంటూ స్వేచ్ఛనిచ్చారు. సివిల్ కోర్టు విచారణపై ఈ తీర్పు ప్రభావం ఉండదని వ్యాఖ్యానించారు.

# చర్చకు రా.. తేల్చుకుందాం!

-మొదటిపేజీ తరువాయి

దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయమని ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో స్పీకర్‌కు లేఖ రాయి. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసింది ఎవరు? ప్రాణహిత%–%చేవెళ్లను తరలించి లక్ష కోట్లు దోచుకున్నది ఎవరో చర్చిద్దాం..' అని అన్నారు. కేసీఆర్ సూచనలతో హరీశ్‌రావు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు భరోసా కింద ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో మంగళవారం సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో రేవంత్ మాట్లాడారు. 'చంద్రబాబును కలిసి గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నయ్.. రాయలసీమకు తరలించమని 2016లో చెప్పింది నువ్వు కాదా? నువ్వు చెప్పినంకనే కదా ఉమాభారతి ఆదేశాల మేరకు చంద్రబాబు హంద్రీనీవా నుంచి 400 టీఎంసీలు తరలించడానికి 2016లో జీవో ఇచ్చిండు. 2018లో వ్యాప్కోస్ సంస్థను నియమించి, 400 టీఎంసీలు హంద్రీనీవా నుంచి బనకచర్లకు తరలించడానికి ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చింది నిజం కాదా? నువ్వు ఇచ్చిన దిక్కుమాలిన సూచనతోనే ఈ దరిద్రం దాపురించింది? తెలంగాణను ఎడారిగా మార్చేలా వందలాది టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించమని చెప్పింది నువ్వు. నేను తప్పు చేసినట్టు ఒక్క ఆధారం చూపిస్తే దేనికైనా సిద్ధం. నేను మొత్తం వివరాలతో వస్తా? నువ్వు చెప్పిన తారీఖు నాడు అసెంబ్లీలో చర్చకు పెట్టించే బాధ్యత శ్రీధర్‌బాబు తీసుకుంటరు. నువ్వు, నేను చర్చ చేద్దాం. నువ్వు సిద్ధంగా ఉన్నవా?..' అని సీఎం నిలదీశారు.

ఆ ప్రాజెక్టులన్నీ ఎందుకు ఆగిపోయాయి?

'బీఆర్ఎస్ పదేళ్ల వాళ్ల పాలన ఎలా ఉందో.. 18 నెలల మా పాలన ఎలా ఉందో గ్రామాల్లో, రచ్చబండల దగ్గర రైతులు చర్చ పెట్టాలి. వ్యవసాయాన్ని పండుగ చేయాలని 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంటుపై తొలి సంతకం చేశారు.

రుణమాఫీ అమలు చేశారు. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే మొదలయ్యాయి. కానీ కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. కాళేశ్వరం కూలేశ్వరమై లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయినయ్. ప్రాజెక్టు కూలిపోయినందుకు నిన్ను చిన్న కాళేశ్వరంలోనే ఉరి తీసినా తప్పు లేదని అక్కడి రైతాంగం అంటున్నది నిజం కాదా? కేసీఆర్ కాంట్రాక్టర్లకు రూ.2 లక్షల కోట్లు చెల్లించిండు. మరి రూ.1,000 కోట్లతో పూర్తి కావాల్సిన కల్వకుర్తి ఎందుకు ఆగిపోయింది? రూ.300 కోట్లతో పూర్తి కావాల్సిన భీమా, రూ.200 కోట్లతో పూర్తి కావాల్సిన నెట్టెంపాడు, రూ.6 వేల కోట్లతో పూర్తి కావాల్సిన సీతారామ ఎందుకు ఆగిపోయాయి? దేవాదుల పూర్తి చేస్తే 4 వేల ఎకరాలు సాగయ్యేవి..ఎందుకు పూర్తి చేయలేదు? ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులపై సీమాంధ్రులు నిర్లక్ష్యం వహించారన్న నువ్వు.. పదేళ్లలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశావా? ఈ దుర్మార్గానికి నువ్వు, నీ కుటుంబం కారణం కాదా? కృష్ణా జలాల్లో 68 శాతం కేటాయింపులు తెలంగాణలో, 32 శాతం కేటాయింపులు ఆంధ్రలో ఉండాలి. ఈ లెక్కన 555 టీఎంసీల వాటా తెలంగాణకు రావాలి. కానీ 290 టీఎంసీలు తెలంగాణకు తీసుకుని, 519 టీఎంసీలు ఆంధ్రకు ఇచ్చి తెలంగాణ రైతాంగానికి మరణశాసనం రాసిందే నువ్వు.

**అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం..**

మేం తెలంగాణకు న్యాయం కోసం పోరాడుతున్నం. గోదావరి%–%బనకచర్లకు అనుమతులు ఇవ్వవద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కేంద్రమంత్రిని కోరాం. ప్రాజెక్టులను పడావు పెట్టి మీరు ఫాంహౌస్‌లో పడుకుంటే.. మేం వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం. అప్పుడంటే జానారెడ్డి నీతో ఎందుకని ఊరుకున్నాడు. ఇప్పుడు అసెంబ్లీకి రా. నీ సంగతి చెపుతా..' అని రేవంత్ అన్నారు.

**మీకు ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చినయ్?**

'కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను క్యాన్సర్ బారిన పడేసి మాకు అప్పగించారు. కోకాపేట భూములు, ఓఆర్ఆర్ అమ్మి రైతుబంధు ఇచ్చారు. రైతుల పేరుతో అప్పులు చేసిండు.. దోపిడీ చేసిండు. తెలంగాణ రాష్ట్రం రాకముందు మీ ఆర్థిక పరిస్థితి ఏంటి? ఇప్పుడేంటి? మొయినాబాద్‌లో హరీశ్‌రావుకు, జన్వాడలో కేటీఆర్‌కు, గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చినయ్? రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పు మిగిల్చి, పదేళ్లలో నిజాం నవాబుల కంటే ధనవంతులయ్యారు.

మేం మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశాం. మీరు పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ప్రజలకు చెప్పు. కాళేశ్వరం పేరుతో మీరు రూ.లక్ష కోట్లు కొల్లగొడితే.. 18 నెలల్లో లక్షా 4 వేల కోట్లు ఖర్చు చేసి రైతులను ఆదుకున్న చరిత్ర మాది. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ఉక్కు సంకల్పంతో ప్రజా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం

**మా తొలి ప్రాధాన్యత రైతులే**

ప్రజా ప్రభుత్వంలో మా మొదటి ప్రాధాన్యత రైతులుం. ఆ తర్వాత మా ఆడబిడ్డలు, ఉద్యమకారులు, విద్యార్థులు. ఆనాడు కేసీఆర్ రైతుబంధు ఎగ్గొడితే మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.7,625 కోట్ల నిధులు విడుదల చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం. కేసీఆర్ ఆనాడు వరి వద్దంటే మేం వరి పండించండి అని చెప్పాం. చివరి గింజ వరకు కొనడమే కాదు.. మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, వాకిటి శ్రీహరి, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే జరుగుతాయని, కాంగ్రెస్ పార్టీయే తిరిగి అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చే బాధ్యత పార్టీ నాయకులదేనని చెప్పారు. '1994%–%2004 వరకు పదేళ్లు టీడీపీ, 2004%–%2014 వరకు పదేళ్లు కాంగ్రెస్, 2014%–%23 వరకు తొమ్మిదేళ్లు బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయి. ఇక 2023%–%33 వరకు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. ఈ పదేళ్లూ అధికార బాధ్యతలు నేను చూసుకుంటా. పార్టీ కోసం పనిచేసే వారిని కాపాడుకునే బాధ్యత నాది. మీరు భవిష్యత్తు నాయకులను తయారు చేయండి..'అని సీఎం కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా కొత్తగా నియమితులైన వారికి నియామక పత్రాలిచ్చే కార్యక్రమం మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా పార్టీ పదవులు పొందిన వారికి అభినందనలు తెలిపిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.

**పదవులకు న్యాయం చేయాలి..లేదంటే తప్పిస్తారు**

'పార్టీ నిర్మాణంలో కొత్తగా పదవులు పొందినవారు భాగస్వాములు కావాలి. అప్పుడు ప్రభుత్వంలో మీరూ భాగస్వాములవుతారు. రాజకీయంగా ఎదగడానికి ఈ పదవులు, వేదికలే ఉపయోగపడతాయి. ప్రభుత్వ బాధ్యతల కంటే పార్టీ బాధ్యతలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. వేలాది మంది పోటీ పడినా ఈ పదవులు మీకే దక్కినందుకు వాటికి న్యాయం చేయాలి. పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. పార్టీలో పనిచేసే వారికి తప్పకుండా అవకాశాలు వస్తాయి. నేను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీ అనుబంధ సంఘాల బాధ్యతలు తీసుకునేందుకు కొందరు అంగీకరించలేదు. అంగీకరించి బాధ్యతలు తీసుకున్నవారు ఇప్పుడు కార్పొరేషన్ చైర్మన్లు అయ్యారు. అయితే పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు అయినంత మాత్రాన ఇక రాజకీయ జీవితం నల్లేరు మీద నడక అవుతుందని అనుకోవద్దు. మీరు ఈ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తేనే రాజకీయంగా ముందుకెళతారు. లేదంటే ఎన్నికల ముందు తప్పిస్తారు..'అని రేవంత్ చెప్పారు.

**భవిష్యత్తులో చాలా అవకాశాలు**

'నాయకుల ఎన్నికలు అయిపోయాయి. ఇప్పుడు మిగిలింది కార్యకర్తల ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కష్టపడిన వారికి, కష్టపడి కార్యకర్తలను గెలిపించిన వారికి అవకాశాలు వస్తాయి. భవిష్యత్తులో చాలా పరిణామాలు జరుగుతాయి. డీలిమిటేషన్ జరుగుతుంది. అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయి. మహిళలకు రిజర్వేషన్లు వస్తాయి. 2029లో మీలో చాలామందికి అవకాశాలు వస్తాయి. అప్పటికల్లా సిద్ధంగా ఉండండి..'అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.


**అలా చేస్తే పార్టీకి తిరుగుండదు: భట్టి**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల కా లంలోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామ ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఒక్క సంక్షేమ పథకాల కోసమే రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ నేతలు ప్రజల్లోకి సరిగ్గా తీసుకెళితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగుండదని అన్నారు. సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సలహాదారు షబ్బీర్ అలీ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అవును..అంతా అక్క కష్టమే..**

జగ్గారెడ్డి దంపతులపై సీఎం చలోక్తి ఆది శ్రీనివాస్, వాకిటి శ్రీహరి, భట్టి విక్రమార్క, మహేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, షబ్బీర్ అలీ, నాయిని రాజేందర్‌రెడ్డిలు పార్టీలో ఎలా ఎదిగారో సీఎం వివరించారు. జగ్గారెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన భార్య నిర్మలా జగ్గారెడ్డికి కీలకమైన టీజీఐఐసీ చైర్మన్ పదవి ఇచ్చామని చెప్పారు. జగ్గారెడ్డి అందులో తనదేమీ లేదని అనడంతో.. 'అవును.. నిర్మలక్కకు పదవి రావడంలో జగ్గారెడ్డికి సంబంధం లేదు. ఆమె పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. కష్టపడ్డారు.. అందుకే పెద్ద కార్పొరేషన్‌కు చైర్మన్ అయ్యారు. అంతా అక్క కష్టమే..'అంటూ సీఎం చలోక్తి విసిరారు.

# బనకచర్లపై ఎక్కడైనా చర్చకు సిద్ధం



హైదరాబాద్

'హామీల గురించి ప్రశ్నిస్తున్నందుకే రేవంత్‌రెడ్డి మాపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. మేము సంయమనం పాటిస్తాం. మీరిచ్చిన హామీలు అమలయ్యేదాకా మీ వెంటపడుతూనే ఉంటాం. మీ అబద్ధాల పుట్టను బద్దలుకొడతాం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'స్థానిక ఎన్నికల్లో గెలుపుపై భరోసా లేకనే విధి లేని పరిస్థితుల్లో రైతుభరోసా వేసి తానే ఛాంపియన్ అని రేవంత్‌రెడ్డి చెబితే ఎవరు నమ్ముతారు? ఎన్నికల్లో ఇష్టారాజ్యంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడం లేదు. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుండడంతో రేవంత్‌రెడ్డి అబద్ధాలతో రోజులు నెట్టుకొస్తున్నారు. రూ.లక్ష కోట్లు కూడా ఖర్చు కాని కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని అంటుంటే ప్రపంచం నవ్వుతోంది. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిగా మారితే ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఎందుకు ఉంటుంది? రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి పెరగడానికి ఒక్క చెక్‌డ్యామ్ కట్టారా? ఒక్క కాలువ తవ్వారా? కేసీఆర్.. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. రూ.2లక్షల కోట్లు ఖర్చు పెట్టి 44 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. అందుకే ధాన్యం ఉత్పత్తి 3 కోట్ల టన్నులకు చేరింది. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. రేవంత్ చేస్తున్న ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపించి తెలంగాణకు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేస్తాం. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయని మీరు ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలాయని అంటున్నారు. ఇది సబబేనా? 30లక్షల మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతుభరోసాపై సీఎం మాట్లాడాలి. రేవంత్‌రెడ్డికి నీతి, నిజాయతీ ఉంటే రూ.1,200 కోట్ల బోనస్ బకాయిలను జమ చేయాలి. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు విజయోత్సవాలు కాదు..క్షమాపణలు చెప్పాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

1975. జూన్ 25. స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత చీకటిమయమైన అధ్యాయానికి తెర లేచిన రోజు. దేశం ఎన్నటికీ మర్చిపోలేని రోజు. అధికారాన్ని కాపాడుకునేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించిన రోజు. ఆ నిశిరాత్రి వేళ ఆమె తీసుకున్న చీకటి నిర్ణయం ఏకంగా 21 నెలల పాలు దేశ ప్రజల పాలిట నిత్య కాళరాత్రే అయింది. ఎటుచూసినా దమనకాండ. రాజకీయ ప్రత్యర్థులు మొదలుకుని సామాన్యుల దాకా దేశవ్యాప్త నిర్బంధాలు. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక హక్కులు దేవుడెరుగు, జీవించే హక్కుకే దిక్కు లేని దుస్థితి.
పత్రికా స్వేచ్ఛను ఉక్కుపాదంతో తొక్కిపెట్టిన పరిస్థితి! సర్వం సహా అధికారమంతా ఇందిర చిన్న కుమారుడు సంజయ్‌గాంధీ రూపంలో ఓ రాజ్యాంగేతర శక్తి చేతుల్లో కేంద్రీకృతం! అసలే దుందుడుకుతనానికి మారుపేరు. ఆపై బాధ్యతల్లేని అధికారం. దాని అండతో, సన్నిహిత కోటరీ చెప్పినట్టల్లా ఆడుతూ ఆయన పాల్పడ్డ అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. అనుమానం వచ్చిన వారల్లా జైలుపాలే. చివరికి జనాభాను తగ్గించే చర్యల పేరిట కంటబడ్డ వారికల్లా బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిపారేయడం సంజయ్ నియంతృత్వ పోకడలకు పరాకాష్టగా నిలిచింది.
మొత్తంగా దేశమే ఓ జైలుగా మారి 21 నెలల పాటు అక్షరాలా హాహాకారాలు చేసింది. అయితే అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే అయింది. ఎమర్జెన్సీ ఎత్తివేత అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరను ఓడించి, నియంత పోకడలు పోయేవారికి ప్రజలు మర్చిపోలేని పాఠం నేర్పారు. అలాంటి ఎమర్జెన్సీ చీకటి అధ్యాయానికి తెర లేచి నేటికి సరిగ్గా 50 ఏళ్లు.

**..అలా మొదలైంది**

నిజానికి ఎమర్జెన్సీ నాటికి దేశమంతటా నానారకాలుగా అస్థిరత రాజ్యమేలుతోంది. ఇందిరకు వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ తదితరుల సారథ్యంలో విపక్షాలు సంఘటితమవుతూ వస్తున్నాయి. అయితే ఎమర్జెన్సీకి పూర్వ రంగాన్ని సిద్ధం చేసింది మాత్రం ఇందిర ఎన్నికను రద్దు చేస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్‌లాల్ సిన్హా వెలువరించిన చరిత్రాత్మక తీర్పే. 1971 లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఇందిరపై తలపడి ఓడిన సోషలిస్టు పార్టీ అభ్యర్థి రాజ్ నారాయణ్ ఆమె ఎన్నికను సవాలు చేస్తూ కోర్టుకెక్కారు. ఇందిర ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందిర ఎన్నికల ఏజెంటు యశ్‌పాల్ కపూర్ ప్రభుత్వోద్యోగిగా ఉంటూనే ఆమె కోసం పని చేశారని పేర్కొన్నారు. ఈ కేసును కొద్దిరోజులకు అంతా మరచిపోయినా బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం తాలూకు ఆర్థిక భారం కారణంగా నాలుగేళ్లుగా జనంలో రగులుతున్న అసంతృప్తి ఇందిర సర్కారుపై ఆగ్రహంగా మారుతున్న సందర్భమది. మూడేళ్ల పాటు ఇందిర సర్కారుకు వ్యతిరేకంగా విపక్షాలు నానాటికీ బలం పుంజుకోసాగాయి. అలాంటి సమయంలో ఎంపీగా ఇందిర ఎన్నికను కొట్టేస్తూ జస్టిస్ సిన్హా 1975 జూన్ 12న అనూహ్యంగా సంచలన తీర్పు వెలువరించారు. అంతేగాక ఆమె ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు కూడా వేశారు! దానిపై ఇందిర సుప్రీంకోర్టుకు వెళ్లినా లాభం లేకపోయింది. ఆమెను ప్రధానిగా కొనసాగనిచ్చినా, పార్లమెంటులో ఓటు హక్కులకు మాత్రం కత్తెర వేస్తూ జూన్ 24న సుప్రీం తీర్పునిచ్చింది.
ఇది విపక్షాలకు అతి పెద్ద ఆయుధంగా అందివచ్చింది. జేపీ ఇచ్చిన సంపూర్ణ క్రాంతి (సంపూర్ణ విప్లవ) నినాదం అప్పటికే దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తోంది. చూస్తుండగానే దేశమంతటా, ముఖ్యంగా ఉత్తరాదిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు మిన్నంటసాగాయి. సుప్రీం తీర్పు వచ్చిన మర్నాడు జూన్ 25న విపక్షాలన్నీ ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో భారీ స్థాయిలో నిర్వహించిన సంపూర్ణ విప్లవ ర్యాలీ సర్కారు పునాదులనే కదిలించింది. పౌరులు సహాయ నిరాకరణ చేయాలని, పోలీసులు, సైనిక బలగాలు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాకుండా అంతరాత్మ ప్రబోధానుసారం నడచుకోవాలని జేపీ ఇచ్చిన పిలుపు కేంద్రం గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. పరిస్థితులు చేయి దాటుతున్నాయని భావించిన ఇందిర సన్నిహితులతో సంప్రదించి ఓ నిర్ణయానికి వచ్చారు. 'అంతర్గత భద్రతకు ముప్పు పొంచి ఉన్నందున దేశమంతటా ఎమర్జెన్సీ విధించా'లంటూ ఆ అర్ధరాత్రే రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు సిఫార్సు చేయడం, క్షణాల మీద ఆయన ఆమోదముద్ర వేయడం చకచకా జరిగిపోయాయి.

**ఏం జరిగింది?**

ఎమర్జెన్సీ కారణంగా వాక్ స్వాతంత్ర్యంతో పాటు ప్రజల రాజ్యాంగపరమైన హక్కులన్నీ రద్దయ్యాయి.
మీడియాపై కనీవినీ ఎరగని రీతిలో పూర్తిస్థాయి ఆంక్షలు కొనసాగాయి.
అనుమానం వస్తే చాలు, ఎంతటివారినైనా ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవడం పరిపాటిగా మారింది.
జేపీతో పాటు అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే ఆడ్వాణీ, మధు దండావతే, నానాజీ దేశ్‌ముఖ్, ప్రకాశ్‌సింగ్ బాదల్, కరుణానిధి, జార్జి ఫెర్నాండెజ్, ప్రకాశ్ కారత్ తదితర విపక్ష నేతలందరినీ నిర్బంధించి జైలుపాలు చేశారు.
డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్, మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్ (మీసా) వంటి చట్టాలతో ఎవరినైనా కటకటాల్లోకి నెట్టారు.
ఈ నిర్బంధాలకు గుర్తుగా ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆ సమయంలో పుట్టిన తన కూతురికి మీసా భారతి అని పేరు పెట్టుకోవడం విశేషం!
న్యాయవ్యవస్థ హక్కులకు కూడా కోత పడింది. విపక్ష నేతలను అరెస్టు చేయాలంటూ జారీ చేసే కార్యనిర్వాహక ఉత్తర్వులను న్యాయస్థానాలు సమీక్షించకుండా వాటి అధికారాలకు కత్తెర వేశారు.
జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకంటూ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు.
సుందరీకరణ పేరుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లోని మురికివాడలన్నింటినీ అధికారులు నేలమట్టం చేసి లక్షలాది మందికి నిలువ నీడ లేకుండా చేశారు.

**చివరికేమైంది?**

ఎమర్జెన్సీ ఎత్తేశాక 1977 జనవరి 20న లోక్‌సభను రద్దు చేశారు. తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తొలిసారి ఓటమి పాలైంది.
ఇందిరతో పాటు ఆమె తనయుడు సంజయ్ కూడా ఓటమి చవిచూశారు.
మొరార్జీ దేశాయ్ ప్రధానిగా మార్చి 24న జనతా పార్టీ సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది.
లుకలుకలతో కొద్దికాలానికే కుప్పకూలినా, కేంద్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోయింది.
ఎమర్జెన్సీ ఆందోళనల్లోంచే ఫెర్నాండెజ్, కారత్ వంటి కొత్త తరం నాయకులు ఎదిగి వచ్చారు.

**మీడియాకూ చుక్కలే**

ఎమర్జెన్సీ కాలంలో మీడియాపై ఇందిర సర్కారు, ముఖ్యంగా ఆమె తనయుడు సంజయ్ గాంధీ అక్షరాలా ఉక్కుపాదం మోపారు! అందుకోసం ప్రివెన్షన్ ఆఫ్ పబ్లికేషన్ ఆఫ్ అబ్జెక్షనబుల్ మ్యాటర్ పేరుతో చట్టమే తెచ్చారు.
మాట విననందుకు 200 మందికి పైగా జర్నలిస్టులను అరెస్టు చేశారు. వారిపై పన్నుల ఎగవేత వంటి పలు అభియోగాలు మోపారు.
జేపీ ఉద్యమానికి కవరేజీ ఇచ్చినందుకు కుల్‌దీప్ నయ్యర్, కె.ఆర్.మల్కానీ వంటి జర్నలిస్టులను జైలుపాలు చేశారు.
మాట వినని పత్రికలకు న్యూస్ ప్రింట్ అందకుండా చేశారు.
చివరికి గాంధీ స్వయంగా స్థాపించిన నవజీవన్ ప్రెస్ తాలూకు ప్రింటింగ్ యంత్రాలన్నింటినీ జప్తు చేశారు.
ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ), యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూఎన్ఐ), హిందూస్తాన్ సమాచార్, సమాచార్ భారతి వంటి వార్తా సంస్థలను 'సమాచార్' పేరిట బలవంతంగా విలీనం చేసిపారేశారు.
వార్తా పత్రికలపై నియంత్రణ కోసం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో ఒక ఐపీఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించారు. ప్రతి వార్తనూ అక్షరాక్షరం క్షుణ్నంగా చదివి సరేనన్న మీదటే ప్రింటుకు వెళ్లేది.
ఇన్ని చేసినా కలానికి మాత్రం సంకెళ్లు వేయలేకపోయారు. నియంతృత్వాన్ని నిరసిస్తూ మీడియా గళం విప్పింది.
ఎమర్జెన్సీ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఖాళీ ఎడిటోరియల్ ప్రచురించింది.

# గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ మోగుతోంది

తిండి, బట్ట, నీడ.. వీటి సరసన ఇప్పుడు ఫోన్ కూడా చేరిపోయింది. అంతలా మన జీవితంలో ఈ ఉపకరణం భాగమైంది. దీనికంతటికీ కారణం టెలికం సేవలు మారుమూల పల్లెలకూ చొచ్చుకుపోవడమే. ఎంతలా అంటే ఏకంగా 120 కోట్ల మంది భారతీయులకు చేరువయ్యేలా! టెలికం చందాదార్ల సంఖ్య పరంగా ప్రపంచంలో చైనా తర్వాత రెండవ అతిపెద్ద దేశం మనదే.
ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా కొత్తగా 30 లక్షల మంది టెలికం చందాదారులు పెరిగారు. ఇందులో మూుడింట రెండొంతులు గ్రామీణ ప్రాంతాలవారే కావడం ఆసక్తికరమైన అంశం. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ ఏప్రిల్ గణాంకాల ప్రకాురం మొత్తం చందాదారుల సంఖ్య 120.38 కోట్లకు చేరుకుంది. ఇక దేశంలో ప్రతి 100 మంది జనాభాకు 85.19 టెలిఫోన్ కనెక్షన్స్ ఉన్నాయి. టెలి సాంద్రత పట్టణాల్లోనే అధికం. ఇక్కడ 100 మంది జనాభాకు 131.46 టెలిఫోన్ కనెక్షన్స్ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 59.26. టెలి సాంద్రత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో 94.77గా ఉంది. ఢిల్లీలో అత్యధికంగా 276.75 ఉంటే, అత్యల్పంగా బిహార్‌లో 57.37 ఉంది. ఇంటర్నెట్ యూజర్లలో సగం వాటా రిలయన్స్ జియో సొంతం చేసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో వైర్‌లెస్ వినియోగదారులు 8.24 కోట్లు కాగా, వైర్‌లైన్ కస్టమర్లు 41.12 లక్షల మంది ఉన్నారు.

**పల్లెల్లో మోగుతోంది**

గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ మోగుతోంది. అవును.. టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు దశాబ్ద కాలంలో పట్టణాల్లో 8.7 కోట్లు పెరిగితే పల్లెల్లో 11.71 కోట్లు అదనంగా వచ్చి చేరారు. చందాదారుల విషయంలో పట్టణాలకు, పల్లెలకు అంతరం తగ్గుతోంది. అంటే గ్రామీణ ప్రాంతాల్లో టెలికం సబ్‌స్క్రైబర్స్ పెరుగుతున్నారన్న మాట. ఈ ఏడాది మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో టెలిఫోన్ చందాదారులు పట్టణ ప్రాంతాల్లో 10 లక్షలు (0.16 శాతం) పెరిగితే గ్రామీణ ప్రాంతాల్లో 19.6 లక్షలు (0.37 శాతం) వృద్ధి చెందడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాలకు టెలికం సేవలు విస్తృతం అవుతుండడమే ఇందుకు కారణం.

**నెటిజన్స్ పెరిగారు**

దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా టెలికం చందాదారుల సంఖ్య 20 శాతమే పెరిగింది. అంటే కొత్తగా 20 కోట్ల మంది తోడయ్యారు. అదే ఇంటర్నెట్ విషయంలో యూజర్ల సంఖ్య పెరిగిన తీరు చూస్తే ఔరా అనిపించక మానదు. 2015లో నెటిజన్ల సంఖ్య 10 కోట్లు మాత్రమే. 2025 ఏప్రిల్ 30 నాటికి బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య 9 రెట్లు దూసుకెళ్లి ఏకంగా 94 కోట్లు దాటింది. చవక స్మార్ట్‌ఫోన్లు, టెలికం కంపెనీల మధ్య చవక టారిఫ్‌ల యుద్ధం.. వెరసి ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య ఈ స్థాయికి చేరింది. 2015 ఏప్రిల్‌లో మొబైల్ ఇంటర్నెట్ యూజర్లు 8.5 కోట్లు, వైర్డ్ సబ్‌స్క్రైబర్స్ 1.5 కోట్లు ఉన్నారు. తాజా గణాంకాల ప్రకారం వైర్‌లెస్ నెట్ వాడకందారులు 90 కోట్లు, వైర్డ్ చందాదారులు 4.14 కోట్లు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు.. కొనసాగుతున్న యుద్ధం?



జెరూసలేం: పశ్చిమాశియాలో యుద్ధం పున:ప్రారంభమైనట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ తూట్లు పొడిచింది. ఇజ్రాయెల్‌పై దాడులకు తెగబడింది. దీంతో ఇజ్రాయెల్ కాల్పుల్ని తిప్పికొట్టింది. ఇరాన్‌పై ప్రతిదాడులకు దిగింది. దీంతో గంటల వ్యవధిలో ఇరు దేశాల మధ్య యుద్ధం పున:ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌కు ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ దాడులకు దిగిందని హెచ్చరించింది. దాడులు ఇలాగే కొనసాగితే కోలుకోలేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, ఇజ్రాయెల్ వార్నింగ్ ఇరాన్ స్పందించింది. ఇరు దేశాల మధ్య జరిగిన కాల్పుల విమరణ ఒప్పందం జరిగిన తరువాత తాము ఎలాంటి కాల్పులు జరపలేదని . అయినప్పటికీ ఇరుదేశాల మధ్య కాల్పుల మోత మోగూతూనే ఉంది. 12 రోజులుగా కొనసాగుతున్న ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగింపు పలికారు. ఇరు దేశాలు తన మధ్యవర్తిత్వం వల్ల యుద్ధం ఆగిపోయింది.ఇజ్రాయెల్, ఇరాన్‌లు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయని తన ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. దీంతో పశ్చిమాశియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగిసినట్లే అని అందరూ అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఇరాన్ ఇజ్రాయెల్‌పై భీకరదాడి చేసింది. ఇజ్రాయెల్ సైతం అదే తరహాలో ఇరాన్ దాడుల్ని ప్రతిఘటించింది. ఇరాన్ దాడుల్ని ్రజాయెల్ భూభాగంలోకి క్షిపణులను ప్రయోగించిన తర్వాత ఇరాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్)మంగళవారం ఆరోపించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యంతో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పూర్తి కాల్పుల విరమణ అని ప్రకటించిన కొన్ని గంటల తర్వాత ఈ దాడులు జరిగాయి.

## నేడు నింగిలోకి యాక్సియం-4

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా తదితర వ్యోమగాములతో కూడిన యాక్సియం-4 ప్రైవేట్ మిషన్ ప్రయోగం నేడు చేపట్టనున్నట్లు నాసా తెలిపింది. స్పేస్ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా బుధవారం మధ్యాహ్నం 12 గంటల కు ఈ ప్రయోగం చేపట్టనున్నారు.
పెగ్గీ వాట్సన్ క మాండర్‌గా వ్యవహరించే మిషన్‌లో శుక్లా పైలట్‌గా ఉంటారు. వాస్తవానికి ఈ మిషన్ ప్రయోగం మే 29వ తేదీనే చేపట్టాల్సి ఉంది. సాంకేతిక కారణాలు, అననుకూల వాతావరణ పరిస్థి తుల నేపథ్యంలో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది.

## ఉగ్రవాదంపై ఉక్కుపాదమే



న్యూఢిల్లీ


ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం మోపుతుందని ఆపరేషన్ సిందూర్‌తో మరోసారి ప్రపంచానికి చాటామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పాక్‌పై పోరులో మేకిన్ ఇండియా ఆయుధాలు సత్తా చాటాయని గుర్తు చేశారు. జాతి ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి చర్యలకైనా తమ సర్కారు వెనకాడే సమస్యే ఉండబోదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త నారాయణగురు, మహాత్మాగాంధీ మధ్య చరిత్రాత్మక సంభాషణకు వందేళ్లయిన సందర్భంగా సోమవారం జరిగిన ఓ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. బలోపేతమైన భారత్ కోసం వాళ్లు కన్న కలలను నిజం చేసే దిశగా సాగుతున్నట్టు చెప్పారు. "11 ఏళ్ల క్రితం వరకూ దేశాన్ని పాలించిన వారి హయాంలో కోట్లాది ప్రజలు అత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొ న్నారు. మా పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 11 ఏళ్లుగా దేశం సామాజికంగా, ఆర్థికంగా అత్యంత బలోపే తమవుతూ వస్తోంది. రక్షణ రంగంలో స్వావలంబన సాధిస్తోంది. భారత్ తయారు చేసే ఆయుధాలు ప్రపంచమంతటా జెండా ఎగరేసే రోజులు ఎంతో దూరం లేవు" అని ధీమా వెలిబుచ్చారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో ఓట్ల చోరీ

న్యూఢిల్లీ

గతేడాది జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ చోటుచేసుకుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వెంటనే డిజిటల్ ఓటరు జాబితాను, సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 2024లో లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కేవలం ఆరు నెలల వ్యవధి మాత్రమే ఉందని ఆయన మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇంత తక్కువ సమయంలోనే బీజేపీ నేత, సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పోటీ చేసిన నాగపూర్(నైరుతి) అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా 29,219 ఓట్లు నమోద య్యాయని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓట్లేసినట్లు బూత్ స్థాయి అధికారు లు నివేదించారని కూడా ఆయన చెప్పారు. ఈ వ్యవహారంపై మీడియాతో పాటు ఈసీ కూడా నిశ్శబ్దంగా ఉందన్నారు. అందుకే, వెంటనే డిజిటల్ ఓటరు జాబితాను, సీసీటీవీ ఫుటేజీని విడుదల చేయాలని ఈసీని ఆయన డిమాండ్ చేశారు.

## బాలింత కడుపులో టవల్ వదిలేసిన వైద్యులు



ఖమ్మం

మహిళకు ప్రసవం చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి కడుపులో సర్జికల్ టవల్ వదిలేసిన ఖమ్మంలోని పీపుల్స్ నర్సింగ్‌హెూం వైద్యులు పరిహారం, వైద్యఖర్చులు చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు తీర్పు చెప్పారు. మంగళవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఏదులాపురానికి చెందిన కాంద్రుకోట సౌమ్య ప్రసవం కోసం పీపుల్స్ నర్సింగ్‌హెూం ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు 2021 డిసెంబర్ 1న శస్త్రచికిత్స చేశారు. ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కొంతకాలానికి సౌమ్య కడుపు నొప్పి, వాంతులు, ఇతర సమస్యలతో బాధపడటంతో వైద్యులు పరీక్షించి సాధారణ సమస్యగానే చెబుతూ మందులు ఇచ్చారు. అయినా, పరిస్థితి చక్కబడకపోవడంతో 2022 ఏప్రిల్ 1న అదే ఆస్పత్రికి వెళ్తే స్కాన్ చేయించి మరో డాక్టర్ వద్దకు పంపించారు. అక్కడి వైద్యులు కడుపులో రాయి వంటి పదార్థాన్ని గుర్తించడంతో సౌమ్య పీపుల్స్ నర్సింగ్‌హెూం వైద్యులకు ఫోన్‌లో చెబితే కలిసే అవకాశం ఇవ్వలేదు. ఆపై ఏప్రిల్ 4న ఆమె తీవ్ర అస్వస్థతకు గురికాగా మరో ఆస్పత్రిలో ఏప్రిల్ 6న ఆపరేషన్ చేయడంతో సౌమ్య కడుపులో 15%శ%20 సైజులో సర్జికల్ టవల్ బయటపడింది. దీంతో ఆమె జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించింది. కేసు వివరాలు పరిశీలించాక వైద్య ఖర్చుల కింద రూ.1,35,533ను 8 శాతం వడ్డీతో చెల్లించాలని.. పరిహారం, మానసిక వేదన, ఇబ్బందుల కింద రూ.5 లక్షలు, కేసు ఖర్చుల కింద రూ.40 వేలను ఖమ్మం పీపుల్స్ నర్సింగ్‌హెూమ్ చెల్లించాలని మంగళవారం తీర్పు ఇచ్చారు.

# దేశ చరిత్రలో చీకటి రోజులు ఎమర్జెన్సీ 1975-77

అసలీ ఎమర్జెన్సీ ఏమిటి? ఏమిటి దాని కదా కమామిషు అని ప్రశ్నించుకుంటే? భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నాటి సోమియట్ యూనియన్ తాష్కెంట్‌లో ఆకస్మికంగా మరణించడంతో నెహ్రూ ఏకైక కుమార్తె ఇందిరాగాంధి ఆయన స్థానంలో ప్రధాని బాధ్యతలు స్వీకరించారు. మొరార్జీ దేశాయ్ వంటి కాకలు తీరిన కాంగ్రెస్ అగ్రనాయకులు ఇష్టంలేక పోయినా ఆమె కింద పనిచేయాల్సిన పరిస్థితి 1969లో కాంగ్రెస్ నిట్ట నిలువుగా చీలిపోయింది. అయినా శ్రీమతి ఇందిరాగాంధి తనదే పైచేయి అనిపించుకుంది. 1971 మార్చిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ ప్రజల్లోకి ఒదిలిన "గరీబీ హఠావ్" నినాదం పాశుపతస్త్రం మాదిరిగా పనిచేసి ఆమె నాయకత్వంలోని కాంగ్రెస్ (ఆర్)కు అఖండ విజయాన్ని కట్టబెట్టింది. మొత్తం లోకసభలోని 518 సీట్లలో 352 సీట్లు గెలుచుకొని రికార్డు సృష్టించారు. ఆ తదుపరి అదే ఏడు డిసెంబరులో బంగ్లాదేశ్ (తూర్పుపాకిస్తాన్) విమోచన యుద్ధంలో సాధించిన అపూర్వ విజయం కూడా ఆమె ఖాతాలోకే చేరింది. అనంతరం శ్రీమతి గాంధీ సభలు యావత్ విశ్వంలో మిన్నంటాయి. అపరకాళికగా ఆమెను దేశంలో జనం కీర్తించడం మొదలు పెట్టారు. దానితో అధికారం మొత్తం తన చెప్పు చేతల్లోకి తీసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తనకు అడ్డు వచ్చే కాంగ్రెస్ శక్తుల్ని అడ్డు తొలగించుకోవడం కూడా ఇందిరాగాంధి వ్యూహంలో భాగం. ఆమె భారత ప్రధానిగా ఉన్న రోజుల్లో చాల దురహంకారపూరిత నియంతృత్వ ధోరణిని ప్రదర్శించేది. 1975-77 ఎమర్జెన్సీ గురించి... "ఇండియాయే ఇందిర... ఇందిరే ఇండియా... " ఇందిరాగాంధీ తిరుగులేని ప్రధానమంత్రిగా ఆవిర్భవించారు. బ్యాంకు జాతీయీకరణ రాజభరణాల రద్దు, బంగ్లాదేశ్ యుద్ధంలో విజయంతో ప్రజల్లో ఆమె ఖ్యాతి అమాంతం పెరిగింది. తనేమి చేసినా చెల్లుతుందనే అహంభావం వచ్చేసింది. తన వారసునిగా తనయుడు సంజయ్ గాంధీని ఎంపిక వంశపారంపరపు పరిపాలన శాశ్వతంగా చేసే ప్రయత్నాలు ప్రారంభించిది. ఇలాంటి పరిస్థతుల్లో ప్రముఖ గాంధీయవాది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అవినీతికి వ్యతిరేకంగా ప్రారంభించిన సంపూర్ణ విప్లవ ఉద్యమం యావత్తు దేశాన్ని కదిలిస్తోంది. సరిగ్గా అప్పుడే గాంధీపై పిడుగుపడింది. రాయబరేలి నుండి పోటీ చేసి విజయం సాధించిన ఇందిర ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు తీర్పు.. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకున్నారని ఆమెపై పోటీ చేసి ఓడిపోయిన రాజ్ నారాయణ్ ఈ కేసు ఫలితం ఇది. ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా అలజడి ... ఇందిర గద్దె దిగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో చుట్టు చేరిన మందిమాగాదుల సలహాల ఫలితంగా ఇందిరలో దాగిన నియంత నిద్ర లేచింది. ఒక కీలక నిర్ణయానికి వచ్చేశారు. అర్ధరాత్రి వేళ ఫకృద్ధీన్ అలీ అహ్మద్‌ని కలుసుకొని కీలక పత్రానాని ఆయన ముందుపెట్టారు. ఫకృద్దీన్ మారు మాట్లాడకుండా సంతకం చేశారు. 352 నిబంధన క్రింద



అత్యవసర పరిస్థితి అమలులోకి వచ్చింది. అర్ధరాత్రి వేళ భారత ప్రజాస్వామ్యం హత్యకు గురైంది. చీకటి రోజులకు తెర లేచింది. రోజు 25 జూన్ 1975.. దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులను రాత్రికి రాత్రి, ఎక్కడికక్కడ జైళ్ళకు తరలించారు. జయప్రకాశ్ నారాయణ్ మురార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అధ్వాని, చరణ్‌సింగ్, ఆచార్య కృపలానీ, అశోక్ మెహతా, జార్జ్ ఫెర్నాండేజ్, మధుదండావతే, రామకృష్ణ హెగ్డే, రాజ్ నారాయణ్ తదితర నాయకలను కటకటాల పాలు చేశారు. అంతే కాకుండా పత్రికలపై సెన్సార్‌షిప్ విధించడంతో దేశ ప్రజలకు అసలు దేశంలో ఏమి జరుగుతుందో తెలియదు. ఆరెస్సెస్‌తో పాటు ఎన్నో సంస్థలను రద్దు చేశఆరు. ప్రశ్నించే వారిని, మేధావులను, పాత్రికేయుల గొంతు నొక్కారు. వారిని మీసా చట్టం కింద జైళ్ళకు పంపారు. దేశంలోని చెరసాలలనీన రాజకీయ ఖైదీలతో కిక్కిరిసి పోయాయి. దీంతో దేశ వ్యాప్తంగా ఎమర్జెన్సీ వ్యతిరేకంగా రహస్య ఉద్యమం ప్రారంభమైంది. ప్రజలు జాగృతం కావడం మొదలు పెట్టారు. ప్రధాన రాజకీయ పార్టీలో కదలిక వచ్చింది. జయప్రకాశ్ నారాయణ సూచన మేరకు భిన్న రాజకీయ పక్షాలు కలిసి పోయి జనతాపార్టీ ఆవిర్భవించింది. కారాగారాల నుండి విడుదలైన అండర్ గ్రౌండులో పనిచేసిన వివిధ పక్షాల నాయకులు నీలం సంజీవరెడ్డి, మీర్ అహ్మద్ అలీఖాన్ (ఓల్డ్ కాంగ్రెస్), సూర్యప్రకాశ్ రెడ్డి, ఎం.ఎల్.సి. జాలిడి యజ్ఞనారాయణ, ఎం.ఎల్.సి. వి.రామారావు, ఎం.ఎల్.సి. (జనసంఘ్) గౌతు లచ్చన్న, ఎం.ఎల్.సి. తేనేటి విశ్వనాథం, సుంకం సత్యనారాయణ, డా.యలమంచిల శివాజీ (స్వతంత్ర పార్టీ), టి.లక్ష్మీకాంతమ్మ ఎంపి (కాంగ్రెస్), ఈశ్వరీబాయి (రిపబ్లికన్ పార్టీ) శీతల్ సింగ్ లష్కరీ, చక్రధర్ రావు, మాజీ ఎంపీ (సోషలిస్టు పార్టీ), తరిమిల రామదాసురెడ్డి (పౌరహక్కుల సంఘం), ఎం.వెంకయ్యనాయుడు, సి.అశోక్ కుమార్ యాదవ్ (ఏబీవీపీ) మొదలగు వారు జనసంఘ్ కార్యాలయం అఫ్జల్ గంజ్ హైదరాబాద్లో 4-2-1977లో మొదటి సమావేశం. జనతాపార్టీ ఆవిర్భావం శ్రీమతి గాంధీ తన ఇంటలిజెన్స్ రిపోర్టు ప్రకారం దేశ వ్యాప్తంగా అనుకూలంగా ఉన్నదనుకొని హఠాత్తుగా జనవరి 1977లో ఎన్నికల నిర్ణయం ప్రకటించింది. ఇందిరాగాంధీ ప్రజలపై తనకు అపారమైన విశ్వాసం ఉందని మార్చి నెలలో ప్రజల నిర్ణయం కొరకు ఎన్నికలు జరుగుతాయని అన్నది. జైళ్ళలో నిర్భంధించిన వారందరినీ విడుదల చేయించింది. ఎమర్జెన్సీ దురాగతాలను ఎదుర్కోవాలని జైలు నుంచి జయప్రకాశ్ నారాయణ "సంపూర్ణ విప్లవం" అంటూ ఇచ్చిన పిలుపు దేశ రాజకీయాల దిశను మార్చి వేసింది. అప్పటి వరకు చిన్న చిన్న పార్టీలుగా ఉన్న అనేక పార్టీలన్నీ ఒకే గొడుగు క్రిందకు వచ్చి జనత పార్టీగా ఏర్పడ్డాయి. ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. మార్చి 20, 1977న జరిగిన లోక్ సభ ఎన్నికలలో ఇందిరాగాంధీని ఆమె నియోజక వర్గంలోను దారుణంగా ఓడించారు. ప్రప్రథమ కాంగ్రెస్సేతర ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు. జనత ప్రభుత్వానికి మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా సారథ్యం వహించారు. అలా చీకటి అధ్యాయం ముగిసింది. భారతదేశ చరిత్రలో అప?డు విధించిన అత్యవసర పరిస్థతికి వ్యతిరేకంగా దేశంలోని ఎంతోమంది నాయకుల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమం ప్రారంభించారు. ఈ ద్యమంలో దాదాపు 1,50,000 మంది ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్నారు.

కానీ స్వాతంత్ర్య సమరంలో కేవలం 1,20,000 మంది మాత్రమే అపుడు దేశం కోసమైతే ఇపుడు ప్రజాస్వామ్యం కోసం జైళ్ళకు వెళ్ళారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత ఉత్తర భారతదేశంలో పలు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ చావుదెబ్బ తిన్నది. శ్రీమతి ఇందిరా గాంధీ కూడా రాజ్ నారాయణ చేతిలో ఓడిపోయింది. ఉత్తర భారతదేశంలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్సేతర ప్రభుత్వాలు ఎమర్జెన్సీలో జైలుకు వెళ్ళిన కార్యకర్తలను మరచిపోకుండా 2014 జనవరి నుండి వారందరినీ స్వాతంత్ర సమరయోధులకు సమానహోదా కల్పించి అన్ని రాయితీలు వారికి అందిస్తున్నారు. ఎమర్జెన్సీ పోయి 47 సంవత్సరాలు పూర్తి అయినా దక్షిణ భారత రాష్ట్రాల ఎమర్జెన్సీ యోధులకు ఏ విధమైన గుర్తింపు రాయితీ అందకపోవడం అత్యంత బాధకరమైన విషయం. 2014 ఎన్నికల్లో భారీగా మార్పులు జరిగి, బీజేపీ అత్యంత మెజారిటీ సాధించింది రెండోసారి 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించింది. అయితే సానుకూల సమయం వచ్చిందని భావించినారు కానీ 8 సంవత్సరాలు పూర్తి అయిన దక్షాణ భారత ఎమర్జెన్సీ యోధులకు స్వాతంత్ర్య సమరయోధులతో సమానంగా రాయితీలు అందించాలన్న విషయమే మరచి పోవడం బాధకరం. దక్షిణ భారత రాష్ట్రాల ఎమర్జెన్సీ యోధులకు రాయితీలు, సదుపాయాలు అందకపోవడంతో ఆర్థికంగా చితికిపోయి కార్యకర్తలు మనో వ్యధతో సగానికి సగం స్వర్గస్తులైనారు. ఇక మిగిలింది సగం మందే. వీరిలో ఎందరికీ ఆ సదుపాయాలు అందుతాయో తెలియని పరిస్థితి. ఎండమావులలో నీళ్ళు వెతుకుతున్నట్లుగా ఉన్నది. అందుకే కేంద్ర నాయకులను జాగృత పరచాలి. ఈ ప్రజాస్వామ్య పరిరఓణ సమరయోధులకు సమకూర్చాలన్నదే భారత సురక్ష సమితి ఉద్దేశం.

# బీసీ రిజర్వేషన్లపై భిన్నస్వరాలు

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య నిర్మాణానికి మూలాధార స్తంభాలు. పంచాయతీలు, మున్సిపాలిటీలూ, నగరపాలక సంస్థలూ ప్రజలకు దగ్గరగా ఉండి సేవలు అందించే నియంత్రణ వ్యవస్థలుగా పనిచేస్తాయి. ప్రజల ప్రత్యక్ష ఓట్లతో ఏర్పడే ఈ శక్తి కేంద్రాల్లో అన్ని సామాజిక వర్గాలకూ సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్నదే రాజ్యాంగ లక్ష్యం. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని 42శాతం పెంచిన చట్టం చేసిన నేపథ్యంలో చట్టబద్ధత, ఎన్నికల నిర్వహణ, రాజకీయ ఉద్దేశ్యం వంటి అంశాల్లో వివాదాలు చెలరేగాయి. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో అమలులో ఉన్న 34 శాతంతో పోలిస్తే ఇది 8 శాతం పెంపు. బీసీలకు ప్రాధాన్యతనిచ్చే ఉద్దేశంతో పాటు, రాజకీయంగా వారిని ఆకర్షించాలన్న వ్యూహాత్మక దృష్టితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కానీ ఇది న్యాయపరంగా నిలబడగలదా? అన్న ప్రశ్న తీవ్రంగా ఉత్పన్నమవుతోంది. భారత రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణలు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గనిర్దేశం చేస్తాయి. అయితే సుప్రీం కోర్టు పలు తీర్పుల ద్వారా కొన్ని ప్రమాణాలను ఖరారు చేసింది ు రిజర్వేషన్ల మొత్తం 50 శాతాన్ని మించకూడ దన్నది ప్రధాన నిబంధన. అయితే తప్పని సందర్భాల్లో మూడు కీలక ప్రమాణాలు నిరూపించాల్సిన అవసరం ఉంది: (1) బీసీ జనాభా ఆధారిత విశ్లేషణ, (2) బీసీల రాజకీయ వెనుకబాటు నిర్ధారణకు నిపుణుల కమిషన్ నివేదిక, (3) 50 శాతం మించకుండా నియంత్రణ. తెలంగాణ ప్రభుత్వం తాజా నిర్ణయంలో ఈ మూడు ప్రమాణాల్లో ఏదీ నిరూపణకు నోచుకోలేదన్నది న్యాయవాదుల అభిప్రాయం. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ వ్యవధిపై ప్రభుత్వ అఫిడవిట్, ఎన్నికల కమిషనర్ అభిప్రాయాల్లో కూడా భేదాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం 30 రోజులు అవసరమని పేర్కొంటే, ఎన్నికల కమిషనర్ ప్రకారం రిజర్వేషన్ల పునర్విభజన, గెజిట్ ప్రకటన, డేటా పరిశీలన వంటి ప్రక్రియల నిమిత్తం 60 రోజులు అవసరమని స్పష్టం చేశారు. ఈ సమయ ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసం ఎన్నికల ప్రక్రియను మరింత ఆలస్యానికి గురిచేసే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అందులో 42 శాతం స్థానాలకు బీసీలకు రిజర్వేషన్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది. కొత్త రిజర్వేషన్ అమలుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. అయితే ఈ మొత్తాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వం నుంచి ఎన్నికల కమిషన్‌కు సరైన సమాచారం, సకాలంలో డేటా అందాల్సిన అవసరం ఉంది. ఇదే ఆలస్యం




అయితే ప్రజాస్వామ్య పరిపాలనలో ఖాళీ ఏర్పడే ప్రమాదం ఉంది. రాజకీయ కోణంలో ఈ నిర్ణయం బీసీ వర్గాలను ఆకర్షించాలన్న వ్యూహంగా కనిపిస్తున్నా, న్యాయస్థానంలో దీని వెనుక ఉన్న ప్రక్రియ సుస్థిరంగా లేకపోతే, అధికార పార్టీకి పరాభవం తప్పదు. ఎన్నికల ప్రక్రియ ఆగిపోతే స్థానిక పరిపాలన కుంటు పడి ఎన్నికల నిర్వహణలో జాప్యం అనివార్యం కావచ్చు. ఇది ప్రజా ప్రజా ప్రతినిధులకు, పార్టీలకు మాత్రమే కాదు, ప్రజలకూ నష్టమే. ఇక కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా ప్రాధాన్యతగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర నిర్ణయంపై కేంద్రం స్పందించే విధానం విశేష చర్చకు దారి తీస్తున్నది. సాధారణంగా రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ప్రమేయం ఉండదు. కానీ రిజర్వేషన్ల విధానం రాజ్యాంగ పరిమితులకు విరుద్ధమైతే కోర్టు అభ్యర్థించిన సందర్భంలో కేంద్రం తన అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాలలో కేంద్రం తన అభిప్రాయాన్ని వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి ు బీసీలకు రిజర్వేషన్ అవసరమే కానీ చట్టబద్ధత అవసరం అన్నదే కేంద్ర స్థాయి వైఖరి. ఇటీవల ఎన్డీఏ కూటమిలో కొత్త బీసీ నేతలకు ప్రాధాన్యత ఇచ్చినదాన్ని బీజేపీ వ్యూహాత్మక రాజకీయంగా పరిగణించవచ్చు. బీసీ ఓటు బ్యాంకును ఆకర్షించాలన్న రాజకీయ వ్యూహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బయటకు తటస్థంగా కనిపించడంతో పాటు లోపల రాజకీయ ప్రయోజనాలను కలిసివచ్చే రీతిలో వ్యవహరించ వచ్చున్న అనుమానాలు వెలుగు చూస్తున్నాయి. అయినా రిజర్వేషన్ వ్యవహారంలో మాత్రం కేంద్రం చాలా జాగ్రత్తగా స్పందించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక్కడ మరో కీలక అంశం ు జాతీయ బీసీ జనగణన డేటా లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం తక్కువ స్థాయిలో సర్వేలు, కమిషన్ నివేదికల ఆధారంగా రిజర్వేషన్లను సజావుగా అమలు చేయవచ్చున్న న్యాయ అభిప్రాయాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇలాంటివి చేపడితే కేంద్రం నుంచి వ్యతిరేక స్పందన తక్కువగా ఉండే అవకాశం ఉంది. గతంలో కేంద్రం తరచుగా రాష్ట్రాలకు స్వతంత్ర నిర్ణయాధికారం ఉందన్న అభిప్రాయాన్ని వెల్లడించిన సందర్భాలున్నాయి. తుది విశ్లేషణలో చూస్తే ు బీసీ రిజర్వేషన్ అంశం ఒక సామాజిక న్యాయ విధానం అయినప్పటికీ, అది రాజ్యాంగ ప్రమాణాలకు లోబడి అమలవ్వాలి. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం ప్రజాస్వామ్యంలో అవసరమే కానీ, చట్టపరమైన ప్రమాణాలను పక్కన పెట్టి ఆ లక్ష్యాన్ని సాధించలేం. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజికంగా సమర్థనీయమైనదైనా, న్యాయస్థానాల్లో నిలబడగలగాలంటే ప్రక్రియా పరంగా పటిష్టత అవసరం. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో వైఖరిని స్పష్టం చేసి, న్యాయ ప్రమాణాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ఈ సంక్షోభం పరిష్కారానికి మార్గం.

# శాంతికి శరణ్యం ప్రజాస్వామ్యమే

శాంతి, సమభావం, సమిష్టి క్షేమమే ఆధునిక ప్రజాస్వామ్య యుగధర్మమని శ్రీశ్రీ పదేపదే వక్కాణించాడు. ప్రజాస్వామ్య పరిపాలనకు ఇదే గీటురాయిగా భావించాలని ఆ మహాకవి తీర్మానించాడు. మనం 21వ శతాబ్దంలో జీవిస్తున్నాం. 20వ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాలను విశ్వమానవాళి చవి చూసింది. మొదటి ప్రపంచయుద్ధ కాలం 1914-19. రెండవ ప్రపంచ యుద్ధ కాలం 1939-44. ఈ రెండు ప్రపంచయుద్ధాల్లో కోట్లాది మంది చనిపోయారు. మరికొన్ని కోట్లమంది క్షతగాత్రులయ్యారు. 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి ప్రజానీకంపై అమెరికా కురిపించిన ఆటంబాంబుల విషమ ఫలితాలను ఆ దేశం నేటికీ అనుభవిస్తూనే ఉన్నది. అయినా కొందరు దేశాధి నేతలు (పాలకులు) ఇప్పటికీ కళ్లు తెరవక, చరిత్ర గుణపాఠాలు నేర్వక, ఆధిపత్య స్వార్థంతో, జాత్యాహంకారంతో, మతోన్మాదంతో యుద్ధాలకు తెగబడుతూనే ఉన్నారు. తానుపట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్టు మూర?ంగా వ్యవహరిస్తున్నారు. ఏకపక్షంగా యుద్ధ దాడులు చేస్తూ ఆయా దేశాలను లొంగదీసు కోవాలని చూస్తున్నారు. అక్కడి దేశవనరులు, సహజ సంపద, గనులు, చమురులను కొల్లగొట్టాలని పన్నాగాలు పన్ను తున్నారు. ఆ కారణంతో ఆ దేశ ప్రజలను నయాబానిసలుగా మార్చడం లేదా పొరుగుదేశాలకు కాందిశీకులుగా తరిమిగొట్టే నరరూప రాక్షసులుగా మారుతున్నారు. వీరు ప్రజల ప్రాణాలకు వీసమెత్తు విలువ నీయరు. కరడుగట్టిన అమానుషత్వమే వీరి నరనరాన జీర్ణించుకు పోయినట్టున్నది. పైపై రూపాలేమైనా కావచ్చుగానీ, కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లు అంతిమంగా ఇవి సామ్రాజ్యవాద మార్కెట్ దోపిడీకై సాగే యుద్ధాలని మనం మరువకూడదు. ఇజ్రాయిల్- పాలస్తీనా (గాజా)పై యుద్ధదాడి చేస్తూనే ఇప్పుడు తాజాగా మరల ఇరాన్‌తో యుద్ధపోరుకు తలబడింది. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇజ్రాయిల్ అతిదుర్మార్గంగా ఇరాన్‌లో చొరబడి యురేనియం శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేస్తున్నది. అణుబాంబు తయారీకి ఇరాన్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నదని, ఆ ముప్పునుండి తప్పిం చుకునేందునే తాము ముందస్తు దాడికి దిగామని ఇజ్రాయిల్ నేత నెతన్యాహు అంటున్నాడు. ఇరాన్ నేత ఖొమైనీ అంతమైతేనే యుద్ధానికి ముగింపు అని వాదిస్తున్నాడు. 'ఖొమైనీని మేం ఇప్పుడే చంపం. ఆయన ఎక్కడ దాక్కున్నాడో ఆ జాడ మాకు తెలుసు. అసలే మాకు ఓపిక తక్కువ. త్వరగా భేషరతుగా ఇరాన్ లొంగిపోతే మంచిది' అని ట్రంప్ తన వాచాల త్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. అంతే కాదు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ప్రజలు ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నాడు. గాజా మాదిరి ఇరాన్‌ను కూడా ధ్వంసం చేసి చేజిక్కుంచు కోవాలనేది ట్రంప్ కుట్రగా కనపడుతున్నది. అయితే ఈ యుద్ధం ఎంత కాలం సాగుతుంది? ఎంత విధ్వంసం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు నిర్దాక్షిణ్యంగా గాలిలో కలసిపోతాయి? ఈ యుద్ధం పశ్చిమాసియా అంతా వ్యాపించి, కడకు మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తుందా..? అనేదే యావత్ మానవాళి ముందున్న ప్రశ్న. ట్రంప్ రెండో రాకడ అనంతరం యుద్ధజ్వాలలు ఎగిసేగిసి పడుతున్నాయి. తన జోక్యంతోనే శాంతి లభిస్తుంది అని ట్రంప్ ఎన్ని ప్రగల్భాలు పలికినా రష్యా ఉక్రెయిన్ యుద్ధం అంతం కాలేదు. గాజా సమూల ధ్వంసం వరకూ ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఆదేశ నేత నెతన్యాహూ ప్రకటిస్తునే ఉన్నాడు. ట్రంప్ కూడా తన టూరిజం, రిసార్టుల వ్యాపారం కోసం గాజా వాసులను ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయమని బెదిరి స్తున్నాడు.ఐక్యరాజ్యసమితి శాంతి నియమాలు, అంతర్జాతీయ కోర్టు నిబంధనలను వీరిరువురూ అసలు లెక్కజేయటం లేదు. భారత్- పాక్ మధ్య జరిగిన యుద్ధం తనవల్లే ఆగిందని ట్రంప్ ఒక పక్క చెప్తూనే మరో పక్క ఉగ్రవాద చర్యలకు ఊతం ఇస్తున్నాడు. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయిల్ కాలుదువ్వడానికి కారకుడ య్యాడు. ట్రంప్ అమానుష, నీతి బాహ్య చర్యలకు వ్యతిరేకంగా, సొంత దేశం అమెరికాలోనే లక్షలాది మంది ప్రజలకు 'నో-కెంగ్' ఉద్యమం పేరిట రోడ్ల మీదకు వస్తున్న విషయం తెలిసిందే. అయితే మన భారత దేశం తొలి నుండి శాంతి కాముకదేశం. సత్యం %-% అహింసల ప్రాతిపదికపై వెలసిల్లిన గౌతమ బుద్ధుని త్రిరత్నాలు దేశగతిని మార్చాయంటే అతిశయోక్తి కాదు. బుద్ధం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి శాంతి ఫరిడవిల్లడానికి కారణభూతమవు తున్నాయి. సంపూర్ణ వికాసం కోసం బౌద్ధం, శ్రమైక జీవనం కోసం సంఘం, పరస్పర శాంతి-సహకారం కోసం ధర్మం ప్రతి వ్యక్తికి అవసరం. ఈ మార్గంలోనే గ్రామాలు, నగరాలు, రాజ్యాలు, దేశాలు ప్రగతి పథంలో సాగుతున్నాయి. ప్రజాస్వామ్యానికి ఇదే ప్రాతిపదిక. ప్రజాస్వామ్యంలో చర్చలు ఉంటాయి. ఎదుటివారిని అర్థం చేసుకోవాలనే సంస్కారం ఉంటుంది. నాతో పాటు అందరూ సమానమే అన్ని స్పృహ ఉంటుంది. ఇచ్చిపుచ్చు కునే గౌరవ మర్యాదలు ఉంటాయి. ఇలాంటి చోట ఆధిపత్యానికి అహం కారానికి తావే ఉండదు. ఉమ్మడి శ్రేయస్కరమే తప్ప రెండో మాటకు స్థానమే ఉండదు. ఇవన్నీ మన జీవన శైలిలో నిబిడీకృ తమై ఉన్నాయి. బౌద్ధాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించిన ఆశోకుని ధర్మచక్రాన్ని మనం మన జాతీయ పతాకంలో కేంద్ర స్థానంలో నిలుపు కున్నాము. చక్రంలోని 24 ఆకులు (రేఖలు) 24 గంటలకు సంకేతంగా నిరంతరం ధర్మపథంలో సాగాలని బోధిస్తున్నాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం ప్రపంచశాంతి కోసం ప్రప్రథమంగా 1949 ఏప్రిల్‌లో పారిస్‌లోనూ, ప్రాగ్‌లోనూ మహాసభలు జరిగాయి. 72 దేశాల నుండి రెండు వేలకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సమస్త దేశాల ప్రయోజనాలను రక్షించి సుస్థిర శాంతి స్థాపనే ప్రపంచ శాంతి సమితి లక్ష్యం అని ఉద్ఘాటించారు. 'మానవాళికి నేడు శాంతి అత్యంత ముఖ్యమై నది. శాంతి సాధనలో మనమంతా, సహచరులం' అని అప్పటి మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తెలిపారు. 'మారణా యుధాలను మనం నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం ఉత్తమం' అని జాన్.ఎఫ్. కెన్నడీ అదే సందర్భంలో అన్నారు. ఈ మాటలు చాలా విలువైనవి, ఆచరించదగ్గవి. ఆ తర్వాత మన దేశం అలీన దేశాల కూటమి స్థాపనకు, సారథ్యానికి కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి వచ్చనపుడు యావత్ దేశం రాజకీయా లకు అతీతంగా ఒక్కటిగా నిలిచింది. అలాగే ఇటీవల పహల్గాంలో ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా సాగిన ఆపరేషన్ సిందూర్ చర్యలకు దేశం ఒక్కటిగా మద్దతు తెలిపింది. విపక్షాలకు చెందిన శశిథరూర్, కనిమొళి, జాన్‌బ్రిటాస్, అసదుద్దీన్ ఒవైసీ వంటి వారు విదేశీ వేదికలపై పాక్ ఉగ్రవాదాన్ని నిర్ద్వంద్వంగా ఎండగట్టారు. మన వైఖరి విస్పష్టంగా తెలిపారు. భారతీయుల శాంతి కాముకత విశ్వ వాప్తంగా మరోసారి వెల్లడైంది. 'భిన్నత్వంలో ఏకత్వమే మా బలం' అని భారత్ సగర్వంగా చాటగలిగింది. అయితే యుద్ధోన్మాద, ఉగ్రవాద మూలాలు తెలుసుకుని చైతన్యంతో వ్యవహరించడం సర్వదా శ్రేయస్కరం. పాకిస్తాన్ ఉగ్రవాదానికి అమెరికా ఊతం ఇస్తున్నట్టు తెలుస్తూనే ఉన్నది. ఈ ఉగ్రవాదం మత పరిధిని దాటి అమెరికాకు లంగిపోతున్నది. అమెరికా కూడా స్వీయ ప్రయోజనానికి ఉగ్రవాదాన్ని వాడుకుంటున్నది. చాలా ఉగ్రవాద సంస్థల మూలాలు మతోన్మాద గర్భంలో పురుడు పోసుకుం టాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి పుట్టిన వికృత కవలపిల్లలే ముస్లిం మతోన్మాదం - హిందు మతోన్మాదం అన్నది చరిత్ర కారుల వర్ణన. ద్విజాతి సిద్ధాంతాన్ని ఒకవైపు జిన్నా, మరోవైపు సావర్కర్ వంటి వారు బలపరచడంలో మన దేశం రెండు ముక్కలై లక్షలాదిమంది మృతదేహాల మధ్యన మనకు స్వాతంత్ర్యం లభించింది. అనంతరం హిందూ-ముస్లిం భాయి భాయి అని పిలుపునిచ్చిన మహాత్మాగాంధీ కూడా హిందూ మతోన్మాది గాడ్సే చేతిలో హతమ్వడం జగద్విదితం. యుద్ధోన్మాదం, మతోన్మాదం, ఉగ్రవాద హింసోన్మాదం ఇవి ఏవైనా ప్రజల ప్రాణాలను చాలా సులభంగా బలికొనేవే. ఆధిపత్య అహంకార పడగనీడలో ఇవి నిత్యం బుసకొడుతూనే ఉంటాయి. దీనికి విరుగుడు సత్యాహింసలతో కూడిన నిజమైన ప్రజాస్వామ్య మార్గమే శరణ్యమని మరోసారి మననం చేసుకోక తప్పదు.

# భూసార పరీక్ష- రైతు భవిష్యత్తుకు రక్ష





**భూమి ఆరోగ్యంగా వుంటేనే రైతు ఆనందంగా వుంటాడు**

**భూసార పరీక్షలతోనే రైతు భవిష్యత్‌కు భద్రత**

**అనంతపూర్,జూన్ 24( ప్రభాత సూర్య)** రైతు జీవితం భూమిపై ఆధారపడిన జీవితం. భూమిలో జీవం ఉంటేనే పంటకు ప్రాణం ఉంటుంది. పంట బాగుంటేనే రైతు బాగుంటాడు దేశానికి అన్నం దొరుకుతుంది. కానీ దురదృష్టకరం ఏమిటంటే, రైతుకు మట్టిలో శక్తి మిగిలి ఉందో లేదో తనకు తెలియక వ్యవసాయాన్ని కష్టంగా కొనసాగిస్తున్నాడు. పలువురు రైతులు అధిక దిగుబడి కోసం అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. పంటలు కోతకాకముందే భూమి అస్థిత్వాన్ని కోల్పోతోంది. శతాబ్దాలనాటి శక్తివంతమైన నేలలు నేడు చౌడు భూములుగా మారిపోతున్నాయి. ఇది కేవలం పంటల దిగుబడిపై ప్రభావం చూపడం కాదు, భవిష్యత్తు తరాలకు భూమిని ఉపయోగించలేనంతగా మారుతున్నాయి. మానవ ఆరోగ్యానికి ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. ఇలాంటి స్థితిలో శాస్త్రీయంగా తీసుకోవాల్సిన తొలి మెట్టు – భూసార పరీక్ష.

**భూమికి పరీక్ష అవసరం**

మనిషి అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకుంటారు. అలానే భూమికి ఆరోగ్య సంబంధ సమస్యలు ఉన్నప్పటికీ రైతులు దానిని గుర్తించలేక సాగు కొనసాగిస్తున్నారు. భూమిలో ఏ పోషకాలు తక్కువ? ఏవి ఎక్కువ? నేల పీహెచ్ స్థాయి ఎంత? చౌడు శాతం ఎంత? వంటి విషయాలు తెలుసుకోవాలంటే భూసార పరీక్షే మార్గం. దీని ద్వారా భూమి ఆరోగ్య స్థితి తెలుసుకోవడానే కాక మట్టిలోని , నత్రజని ఫాస్పరస్, పొటాష్, వంటి ప్రధాన పోషకాలు ఇతర సూక్ష్మ పోషకాలు, సున్నం శాతం, మట్టిలో జీవకణాల స్థితి వంటి అంశాలు ఈ పరీక్షలో తేలుతాయి. దీని ఆధారంగా సరైన ఎరువులు, సరైన మోతాదులు రైతుకు సూచించబడతాయి. దీని ఫలితంగా:

వ్యయం తగ్గుతుంది దిగుబడి పెరుగుతుంది భూమి ఆరోగ్యంగా మారుతుంది పంటల నాణ్యత మెరుగవుతుంది భవిష్యత్ కోసం భూమి సంరక్షించబడుతుంది

**మట్టి నమూనా సేకరణలో పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు:**

పొలంలో ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు మట్టి సేకరించవద్దు. పంటకు నీరు పెట్టిన తర్వాత, నీడపడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలున్న చోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూ నాలు తీయరావద్దు. ఖరీఫ్ సీజన్ లో పంట సాగు చేయక ముందు భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిం చాలి. పొలంలో వీ ఆకారంలో 15–20 సెంటీ మీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పొర నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి. పొలంలో మొత్తంగా 8–10 చోట్ల సేకరిం చిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదురెదురు భాగాలను మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అరకిలో వచ్చే వరకు చేస్తూ ఉండాలి. ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డివేర్లను వేరు చేసి నీడలో అరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్‌లో గానీ పాలిథిన్ కవర్‌లో గానీ నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.

మట్టి సేకరణకు స్థానిక భూసార కేంద్రం సిబ్బంది సాయం తీసుకుంటే వారు రైతు పొలం వద్ద మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతారు

**పండ్ల తోటల కోసం మట్టి నమూనా:**

1–2 మీటర్ల లోతు వరకు గుంట త్రవ్వి ప్రతి అడుగుకు నమూనా విడిగా సేకరించాలి.

ఎక్కడైనా గట్టి పొరలు ఉంటే, వాటి లక్షణాలను వేరుగా పేర్కొనాలి.

పండ్ల తోట భూసార పరీక్ష అని స్పష్టంగా నమూనాపై రాయాలి.

**మట్టి నమూనాతో పంపవలసిన సమాచారం :**

రైతు పేరు, గ్రామం, సర్వే నంబర్, మండలం

ప్రస్తుతం సాగు చేసిన పంట %ఽ% వాడిన ఎరువులు

తదుపరి వేసే పంట వివరాలు

నేలలో గమనించిన సమస్యలు

నీటి లభ్యత/ఎలక్ట్రికల్ కనెక్టివిటీ

తనిఖీ కావాల్సిన పరీక్షలు: (సాధారణ / చౌడు / పండ్ల తోట)

ఈ మట్టిని సమీపంలోని వ్యవసాయ శాఖ భూసార పరీక్ష కేంద్రంకు పంపాలి వాటితో పాటు కొన్ని ప్రభుత్వం ఆమోదం పొందిన ప్రైవేట్ ల్యాబ్ లలో , కృషి విజ్ఞాన కేంద్రాలలో, వ్యవసాయ విశ్వవిద్యాలలో లో కూడా భూసార పరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి

రైతు విజయం భూసారంతో మొదలవుతుంది!

"పంటలో పోషకాలు పెంచాలంటే, భూమిలో పోషకాలను గుర్తించాలి. మట్టిని అర్థం చేసుకున్న రైతు కష్టాన్ని విజయంగా మార్చగలడు!"

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు**

కేంద్ర ప్రభుత్వం 2015లో "సాయిల్ హెల్త్ కార్డ్" పథకం ప్రారంభించింది. లక్షలాదిమంది రైతులకు మట్టిలోని పోషక స్థాయిలను తెలిపే హెల్త్ కార్డులను అందించింది. కానీ పథకం ప్రారంభించి నేటికి దాని ప్రభావం ఆశించినంతగా కనిపించకపోవడానికి కారణం %–% అవగాహన లోపం, వ్యవస్థాపక బలహీనత, భూసార పరీక్షా కేంద్రాల సరిగా పని చేయకపోవడం. రాష్ట్రప్రభుత్వాలు కూడా భూసార పరీక్షలపై క్షేత్ర స్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాయి ఇవి ఎంత వరకు సత్ఫలితాలను కల్పిస్తాయో చూడాలి

భూమిని పరీక్షించండి, భవిష్యత్‌ను రక్షించండి

ఈ రోజుల్లో వ్యవసాయం ఒక సవాలుగా మారింది. మారుతున్న వాతావరణం, సాగు ఖర్చులు, మార్కెట్ అస్థిరతల మధ్య రైతుకు ముందుకు వెళ్లాలంటే భూమిని అర్థం చేసుకోవాలి. ఆ అర్థం భూసార పరీక్షతో మొదలవుతుంది. మట్టి మాట వినండి. దాన్ని పరీక్షించండి. దానికి అద్భుత ఫలితాలిచ్చే శక్తి ఇవ్వండి.

**ఎప్పుడు చేయించాలి**

రైతులు భూసార పరీక్షలను వర్షాధార భూములలో అయితే 3 సంవత్సరాల కోకసారి, నీటి వసతి ఉన్న భూములలో అయితే 3 పంటలకొక సారి చేయించుకోవడం మంచిది

ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభానికి ముందు అలాగే ఏదైన భూమిని మొదటి సారి సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం తప్పని సరి

**మట్టికి పరీక్ష – భవిష్యత్తుకు బలమైన పునాదులు**

భూమి బాగుంటే రైతు బాగుంటాడు

రైతు బాగుంటే దేశం బాగుపడుతుంది

భూమి బాగుండాలంటే భూసార పరీక్ష తప్పనిసరి

## రైతును రాజుగా చేయాలన్న గొప్ప సంకల్పం

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిది



**చొప్పదండి, జూన్ 24( ప్రభాత సూర్య):** పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతున్న రైతు సంబరాలలో భాగంగా చొప్పదండి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతును రాజుగా చేయాలన్న గొప్ప సంకల్పంతో 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు విడుదల చేసి 1 కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదన్నారు. వ్యవసాయం దండగ అన్న చోటనే వారికి బోనస్ అందిస్తూ భరోసా కల్పిస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తురి మహేష్, టీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుమండ్ల గంగయ్య గౌడ్,మాజీ కౌన్సిలర్ కొట్టే అశోక్, మాజీ పట్టణ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్,ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి,నాయకులు గుర్రం రమేష్, కదారి శంకర్,తొడేటి దేవిద్,మావూరపు రాములు,దుస కైలాషపతి,మార్కెట్ డైరెక్టర్స్ ఈర్ల స్వామి, పెరుమండ్ల రవీందర్,పతిపాక నరేష్,జక్కుల అనిల్, చిప్ప శ్రీనివాస్,బిలుమూల స్వప్న,గర్వకుర్తి సునీత,గ్రామ శాఖ అధ్యక్షులు సత్తు శ్రీనివాస్,మారం శ్రీనివాస్,పేరుక శ్రీనివాస్,హన్మంతు రెడ్డి,రెడ్డి సంఘం అధ్యక్షులు కొత్త దామోదర్ రెడ్డి,మారు తిరుపతి రెడ్డి,మచ్చ రమేష్,పెద్ది రాజేందర్,పెద్ది శ్రీనివాస్,పోలురి ప్రసాద్,కొట్టే చంద్రయ్య, కళ్యాణపు శ్రీనివాస్,సంబోజీ సునీల్, చన్ పాషా,బందరి రాజేష్,చాంద్ పాషా, బోడిగె తిరుపతి,నూనె చందు,రాజుల తిరుపతి, నరుకుల గంగరాజు,చీకట్ల గంగారాజు,జహంగీర్,ఎండీ రజాక్ నాయకులు కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు

## స్వదేశానికి పెద్ద ఎత్తున ఇండియన్స్

**న్యూఢిల్లీ :** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య టెన్షన్లు తగ్గలేదు. 11 రోజులుగా జరుగుతున్న యుద్ధంతో అక్కడి జనజీవనం భయానకంగా మారింది. జెరూసలెం లాంటి కొన్ని నగరాలైతే ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు . ఇటు.. యుద్ధభూమి నుంచి భారత పౌరులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ సింధు కొనసాగుతోంది. ఐదు రోజుల్లో ఇరాన్ నుంచి ఎనిమిది విమానాల్లో 1700 మందికి పైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. 162 మంది భారతీయులు ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్ సరిహద్దు దాటి వచ్చారు. టెల్‌అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయంనుంచి బస్సుల్లో భారతీయులను జోర్డాన్‌కి తరలిస్తున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తీసుకొస్తున్నారు.అటు.. ఇరాన్ నుంచి ఇజ్రాయెల్ నుంచి సొంత రాష్ట్రాలకు వస్తున్నారు తెలుగువారు. ఇప్పటి వరకు ఇరాన్ నుంచి నలుగురు, ఇజ్రాయెల్ నుంచి ఇద్దరు విద్యార్థులు తిరిగివచ్చారు. ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న విద్యార్థులకు తోడుగా నిలబడి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు తెలంగాణ భవన్ అధికారులు. సోమవారం సాయంత్రం నాలుగున్నరకు 291 మందితో ఒక విమానం, రాత్రి పదకొండున్నరకు 165 మందితో ఒక విమానం ఢిల్లీకి చేరుకున్నాయి. ఇందులో వచ్చే మొత్తం 18 మంది తెలుగు విద్యార్థులను స్వస్థలాలకు పంపేందుకు ఢిల్లీలోని ఏపీ భవన్ ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉంటే బీహార్ శివాన్ జిల్లాకు ఓ కుర్రాడు ఇరాన్‌లో మిస్సయ్యాడు.

## చింతపల్లి ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన వివిఆర్



**చింతపల్లి (ప్రభాత సూర్య ):** మండలానికి ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ రాంమూర్తిని చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివిఆర్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త మరియు సామాజిక సేవారాదుడు వరికుప్పల వెంకట్ రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్ రాములు ఎస్ఐ రాంమూర్తిని శాలువాతో సన్మానించి, పూల మొక్కను బహూకరించారు. కాసేపు సమావేశమైన సమయంలో మండల పరిస్థితులపై, వాతావరణంపై ఇద్దరూ అభిప్రాయాలు పరస్పరం పంచుకున్నారు. అనంతరం వెంకట్ రాములు మాట్లాడుతూ పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉండి ప్రజాసేవకే అంకితమవుతున్నారు. లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రజలకు రక్షణ కల్పించడమే కాకుండా, బార్డర్ లో సైనికులు చేసే సేవలా, లోపల పోలీసుల సేవలు కూడా సమానంగా మారిపేస్తున్నారని కొనియాడారు. ప్రజల భద్రత కోసం పోలీసుల అహర్నిశ సేవలు గుర్తించి ప్రశంసల వర్షం కురిపించిన వెంకట్ రాములు, ఎస్ఐ రాంమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలు కూడా కొత్త ఎస్ఐ సారథ్యంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రామడుగులో రైతు భరోసా సంబరాలు





**రామడుగు, జూన్ 24( ప్రభాత సూర్య):** రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవాజి హరీష్ ఆధ్వర్యంలో రామడుగు మండల కేంద్రంలో మంగళవారం రోజు రైతు భరోసా సంబరాలు,అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) మంజూరు చేయించినందుకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి వ్యవసాయ శాఖ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు మేడిపల్లి సత్యం కి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.అనంతరం రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్ (మాజీ ఎంపీపీ) మాట్లాడుతూ ఈసారి రైతుభరోసా పథకాన్ని రేవంత్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎలాంటి పరిమితులు, షరతులు విధించకుండా వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న మొత్తం విస్తీర్ణానికి పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది,ఈ మేరకు కోటిన్నర ఎకరాలకు.. ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించడానికి రూ.9 వేల కోట్ల నిధులు సర్దుబాటు చేసింది. ఈ నెల 16న సీఎంరేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులంతా కలిసి జయశంకర్ వర్సిటీలో వానాకాలం రైతుభరోసాకు శ్రీకారం చుట్టారు. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం ప్రకటించారు. ఆర్థికశాఖ నిధుల సర్దుబాటు చేసింది. ఇప్పటివరకు 67 లక్షల మంది రైతులకు రూ.8,285 కోట్ల నిధులు ఖాతాల్లో జమ చేశారు. సోమవారం నాటికి 15 ఎకరాల వరకు రైతుభరోసా చెల్లింపులు పూర్తయినట్లు.ఈ కార్యక్రమంలో మాజీ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి,మాజీ ఎంపిపి వీర్ల నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం రెడ్డి, పూరీల గోపాల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్ర శ్రీను,లక్ష్మణ్ ,అనిల్, బాపురాజు, అంజయ్య, భువన్ కుమార్, అజయ్, రవి, ఆసిఫ్, స్వామి, రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ ప్రజా ప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కప్పల రాజేష్‌ను పరామర్శించిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**ఎల్బీనగర్, జూన్ 24( ప్రభాత సూర్య ):** తుంగతుర్తి నియోజకవర్గం లో అక్రమ మట్టి దందాను ప్రశ్నిస్తున్న యూత్ కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కప్పల రాజేష్ పై అడ్డ గూడూరు మండల కేంద్రంలో ఈనెల 21 శనివారం రాత్రి దుండగులు దాడి చేశారు... ఈ దాడిలో గాయపడ్డ కప్పల రాజేష్ ను వనస్థలిపురం లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.... దాడి విషయం తెలుసుకున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి కప్పల రాజేష్ ను పరామర్శించారు.... రాజేష్ తో పాటు నియోజకవర్గ నాయకులు దాడి జరిగిన తీరు ను రాజ్ గోపాల్ రెడ్డికి తెలియజేశారు....

## అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్







**ఖమ్మం( సూర్య ప్రతినిధి )** ఖమ్మం నగరం పంపింగ్ వెల్ రోడ్డు నందు అన్నవరపు అంజిరెడ్డి అనే ప్రైవేట్ ఎలక్ట్రిషన్ తన ఇంట్లో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుబడ్డాడు. జాయింట్ ఆపరేషన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కళావతి బాయి ప్రోగ్రాం ఆఫీసర్ ఎంహెచ్ఎన్ డాక్టర్ సైదులు టాస్క్ ఫోర్స్ సిబ్బంది తో కలిసి నిన్న అక్రమంగా స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నటువంటి నిందితుడు అన్నపురెడ్డి అంజిరెడ్డిని అతనితో పాటు అతని నిర్వహిస్తున్న స్కానింగ్ మిషన్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోన్నారు.నిందితుని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో అప్పగించి కేసు నమోదు చేశారు.స్కానింగ్ మిషన్ దానికి సంబంధించిన పరికరాలని పంచినామా చేసి సీజ్ చేశారు.పిసి అండ్ పిఎన్డిటి యాక్ట్ 1994 చట్టం ప్రకారం నిందితుడికి పిసి పెయింట్ యాక్ట్ సెక్షన్ సిక్స్ చట్టరీత్యా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరంగా పరిగణించి అలాగే సెక్షన్ 23 సెక్షన్ నిర్ధారణ చేస్తున్న సక్షన్ 23 ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 10 వేల రూపాయల వరకు ఫైన్ అలాగే సెక్షన్ 25 ప్రకారం అతడు స్కానింగ్ మిషన్ ని అనధికారికంగా పర్చేస్ చేసి ఇటువంటి అర్హత లేకుండా లింగ నిర్ధారణ పరీక్షలకు పూనుకోపటం వల్ల సెక్షన్ 25 ప్రకారం ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష లక్ష రూపాయలు అపరాధ రుసుము ఇది ఇచ్చే అవకాశం ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ కళావతి బాయి మాట్లాడుతూ జిల్లాలో ఇలా అక్రమంగా స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నటువంటి నిందితులని వదిలే ప్రసక్తే లేదని వారిని దోషులు చట్టం ముందు నిలబెట్టి కఠినమైన శిక్షలు వేయించే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు.ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఏసిపి టాస్క్ ఫోర్స్ ఏసిపి రవి వారి సిబ్బందికి అలాగే త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, మరియు సబ్ ఇన్స్పెక్టర్ మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

## రాబోయే స్థానిక ఎన్నికలపై టీడీపీ వ్యూహ రచన..!

### మునుగోడు ఇంచార్జ్ బడుగు లక్ష్మయ్యతో కీలక సమావేశం



**మర్రిగూడ (ప్రభాత సూర్య):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య నేతృత్వంలో కీలక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మర్రిగూడ మండల టీడీపీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న యాదవ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలే మల్లయ్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలపై సమీక్షించిన నేతలు, ప్రతి గ్రామ పంచాయతీలో టీడీపీ అభ్యర్థులను బరిలో నిలబెట్టి గెలుపు సాధించేందుకు అవసరమైన వ్యూహాలపై చర్చించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో అధిక మెజార్టీతో గ్రామ పంచాయతీల్లో అధికారాన్ని టీడీపీ అధికారంలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సభ చివర్లో నాయకులు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో సక్రమంగా పనిచేస్తే పంచాయతీ ఎన్నికల్లో టీడీపీకి తిరుగు లేదన్నారు. ప్రజల్లో ప్రభుత్వ వైఫల్యాలు వివరించి పార్టీ పట్ల నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు.

## మర్రిగూడలో ఘనంగా రైతు భరోసా సంబరాలు..

## రైతులకు నిధుల మంజూరు



మర్రిగూడ, ప్రభాత సూర్య: వానాకాలం 2025 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా పథకం ద్వారా రైతులకు అందవలసిన నగదును రైతుల ఖాతాలో విజయవంతంగా పూర్తి చేసి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం పరిధిలోని పలు గ్రామాలైన ఎర్రగండ్లపల్లి, దామర, భీమనపల్లి రైతు వేదికలలో రైతు భరోసా పథకం సంబరాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతం మండలానికి చెందిన మొత్తం 13504 మంది రైతులలో 12728 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ. 16 కోట్లు 94 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై పథకాన్ని ప్రశంసించారు. రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తమ కుటుంబాలకు ఎంతో మేలు చేస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పథకం పేద రైతులకు ఊతమందించేలా ముందుకుసాగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమానికి తాసిల్దారు జే. శ్రీనివాస్, ఎంపీడీవో మునయ్య, వ్యవసాయ అధికారి ఏం. సహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, పీఏసీ చైర్మన్లు బాలం నరసింహ, పందుల యాదయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు పి. విజయ్ కుమార్, సుజాత, రాధిక, శ్రీలత, అరుణ, నాగ స్వాతి, ఆర్ఐ జహురుద్దీన్, పిఎసిఎస్ సీఈవో శీను, డైరెక్టర్లు లింగయ్య, మారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

## సంస్థాన్ లో ఘనంగా రైతు భరోసా సంబరాలు





**సంస్థాన్ నారాయణపురం, జూన్ 24( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు జరుపబడును. రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం ద్వారా నిధులు విడుదల చేయడం తో రాష్ట్రవ్యాప్తంగా రైతు సంబరాలుభాగంగా ఈరోజు మండల కేంద్రంలో టాపాకులను పేలుస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో పాల్గొనడం జరిగింది అనంతరం స్వీట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. రైతులకు పెట్టుబడి సాయం అందించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరెంటో త్ శ్రీనివాస్ నాయక్, డిసిసి ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ, డిసిసి ప్రధాన కార్యదర్శి గుత్తాఉమా ప్రేమ్చందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ వాంకుడోత్ బుజ్జి నాయక్, మండల పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, వీరమల్ల వెంకటేశం గౌడ్, దోనూరు జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నర్సింహ, కుక్కల నరసింహ,రాచకొండ రమేష్ జరుపుల జగన్,చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోడే రఘు,, రతు పల్లి యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు జక్కడి చంద్రారెడ్డి,కొత్తగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు రాచకొండ జంగయ్య, వడ్త్య జగ్రాం, ముత్యాల గాలయ్య,బద్దుల సోమయ్య యాదవ్,కొర్ర రాములు, వంశీ ,కొర్ర నాను, రాజు, ఉదావత్ రాజు,శ్రీను జక్కల యాదయ్య,చెక్క నాగభూషణం,పెద్దగోనిగిరి గౌడ్, కత్తుల నరసింహ, సింగం కృష్ణ, కత్తుల మల్లయ్య, ఎండి గౌసుద్దీన్ ఖురేషి ,రసమల గాలయ్య చిలువేరు నరసింహ రసమల్ల,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# మూలపాడు వద్ద అమరావతి గేట్ వే



**విజయవాడ :** ఇప్పటి వరకు ఎన్నో గేట్ వేలు చూసి ఉంటారు. కానీ ఇక్కడ నిర్మిస్తున్న గేట్ వే గురించి తెలుసుకుంటే, ఔరా అనేస్తారు. అందుకు వేదికగా మారింది ఏపీ రాజధాని అమరావతి. ఇప్పటికే ఎన్నో రికార్డులను దక్కించుకున్న అమరావతి అమ్ముల పొదిలో మరో రికార్డు చేరువ కానుంది. ఇంతకు ఆ రికార్డు ఏమిటి? అసలు గేట్ వే వింతలు విశేషాలు ఏమిటో తెలుసుకుందాం. అమరావతి ఇది కేవలం ఒక పేరు కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని. కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న మౌన చలనాలకి ఇప్పుడు కొత్త ఊపొస్తుందనిపిస్తోంది. మళ్లీ ఓ దిశగా అమరావతి వైపు అధికారులు, ఇంజినీర్లు కదులుతున్నట్టుంది. అయితే ఈసారి దృష్టి కేంద్రంలో ఉన్నది ఒక ప్రత్యేక ప్రాంతం. అక్కడే రాజధానికి ప్రధాన ద్వారం ఏర్పడబోతోం దన్న వార్తలు అధికార వర్గాల్లో హల్‌చల్ సృష్టిస్తున్నాయి. ఈ బ్రిడ్జి ఎక్కడా.. చూసి ఉండరేమో! ఇప్పటికే విజయవాడ ? హైదరాబాద్ జాతీయ రహదారి వెంబడి మూలపాడు వద్ద ఒక ప్రతిష్ఠాత్మకమైన బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ బ్రిడ్జి కేవలం ఓ ట్రాన్స్‌పోర్ట్ కనెక్టివిటీ గానే కాకుండా, అమరావతి నగరానికి ఒక గుర్తింపు చిహ్నంగా మారే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మూలపాడు ప్రాంతాన్ని అమరావతికి ప్రధాన ప్రవేశ ద్వారంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో భూకణాలను పరీక్షించేందుకు అక్కడ మట్టి నమూనాల పరీక్షలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ భూసామర్థ్య పరీక్షలు విజయవాడ ? హైదరాబాద్ జాతీయ రహదారి పై అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఇది కేవలం ఒక సాధారణ పరీక్ష ప్రక్రియ కాదు.. ఇది రాజధాని యొక్క భవిష్యత్ ప్రవేశద్వారానికి వేసే మొదటి అడుగు అని చెప్పవచ్చు. మూలపాడు ప్రాంతం రాజధానికి దగ్గరగా ఉండడమే కాకుండా, రవాణా దృష్టికోణంలోనూ అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. అందువల్లే అధికార యంత్రాంగం ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తూ, అక్కడే ఐకానిక్ బ్రిడ్జితో కూడిన గేట్‌వే అభివృద్ధికి పునాదులు వేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వ స్థాయిలో ఆమోదం లభిస్తే, మూలపాడు ప్రాంతం అమరావతి నగరానికి ప్రధాన ఎంట్రీ పాయింట్‌గా మారనుంది. దీంతో ఆ ప్రాంత అభివృద్ధి వేగంగా పెరిగే అవకాశముంది. ఒకవేళ మూలపాడు ద్వారా రాజధాని అభివృద్ధికి తొలి అడుగు పడితే, అక్కడి స్థానికులకు, వ్యాపారికులకు, రవాణా రంగానికి ఎంతో లాభం చేకూరుతుంది. అంతేగాకుండా, విమానాశ్రయాల నుంచి వచ్చే ప్రయాణికులు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ప్రముఖులకూ ఇదే ప్రధాన మార్గంగా నిలవనుంది! ఇకపోతే, మూలపాడు బ్రిడ్జి ప్రాజెక్టు ప్రత్యేకత ఏంటంటే, ఇది కేవలం వాహనాల రాకపోకలకే కాదు, నగర ముఖచిత్రాన్ని ప్రతిబింబించేలా ఒక ఐకానిక్ ఆర్కిటెక్చర్‌గానూ నిర్మించనున్నారు. శిల్పకళ, ఆధునిక నిర్మాణ శైలి కలబోతగా ఇది ఉండనుంది. ఒక నగరాన్ని గుర్తించే ప్రధాన ద్వారం ఎలానీ ఉండాలో దానికి ఇది ఒక ప్రేరణగా నిలవబోతోంది. విదేశీ మోడళ్లను పరిశీలించి, ఉత్తమ డిజైన్‌ను ఎంచుకునేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదొక అద్భుతం.. ఇక మొట్టమొదటగా మూలపాడును ఎంపిక చేయడానికి మరో కారణం.. ఇది విజయవాడకు అత్యంత సమీపంగా ఉంది. విజయవాడ మెట్రో రైలు, రింగ్ రోడ్ల ప్రాజెక్టులతో కలిపి అమరావతికి తీసుకెళ్లే ప్రధాన రహదారిగా దీన్ని అభివృద్ధి చేయవచ్చు. దీంతో పర్యాటక రంగం, వాణిజ్య కార్యకలాపాలు మరియు ఆస్తి విలువలు అన్నీ పెరిగే అవకాశముంది. మూలపాడు పేరే వచ్చే రోజుల్లో హాట్ లొకేషన్‌గా మారిపోవచ్చని అంటున్నారు రియల్ ఎస్టేట్ వర్గాలు కూడా. ఇప్పటికే రాజధాని నిర్మాణం విషయంలో ప్రభుత్వం సరికొత్త చర్యలు చేపడుతుండగా, వాస్తవిక దిశగా ముందడుగులు పడుతున్నాయి. అలా ముందుగా ప్రారంభించబోయే ప్రధాన అడుగు.. గేట్‌వే టు అమరావతి అనేది మూలపాడులో ఉండబోతుందన్న సంకేతాలు ఇప్పుడు అధికార వర్గాల్లో స్పష్టంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మట్టినమూనాల పరీక్షలు ఆ ప్రాంత భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లుగా భావించవచ్చు. మొత్తంగా చూస్తే, మూలపాడు ప్రాంతం ఒక సాధారణ గ్రామం నుండి రాజధానికి ముఖద్వారంగా అభివృద్ధి చెందబోతుంది. అక్కడ ప్రారంభించబోయే బ్రిడ్జి కేవలం కాంక్రీటు నిర్మాణం కాదు.. అది అక్షరాలా అమరావతికి తలుపుగా నిలవనుంది. ఇది రాజధాని నగరంలో అధికారిక అభివృద్ధి ప్రారంభమవుతోందని సంకేతమిచ్చే తొలి నిర్మాణం కావడం విశేషం. ఇక అమరావతికి మార్గం ఖరారవుతోంది, కదలిక మొదలైంది

# వైసీపీకి కలిసి రాని కాలం

**గుంటూరు :** వైసీపీలో నేతలు ఎందుకు భయపడుతున్నారు? పల్నాడు టూర్ వ్యవహారం అధినేతతోపాటు కేడర్‌కు చిక్కులు తెచ్చిపెట్టిందా? ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు కీలక నేతలు ముఖం చాటేస్తున్నారా? పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని కేడర్ ఆలోచన చేస్తోందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. అధినేత అనేవారు జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఆవేశంతో నిర్ణయాలు తీసుకుంటే నేతలేకాదు.. చివరకు కేడర్ సైతం దూరం అవుతుంది. వైసీపీకి ఇప్పుడు అలాంటి పరిస్థితి ఎదురైంది. పల్నాడు టూర్ వ్యవహారంలో కీలక నేతలపై గుంటూరు జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ టూర్‌లో జగన్ ప్రయాణిస్తున్న వాహనం కిందపడి ఓ వ్యక్తి చనిపోవడంతో కలకలం రేపింది. దీనికి సంబంధించి సాక్షాలు బయటపెట్టి కేసు నమోదు చేశారు పోలీసులు. ఏ1 రమణారెడ్డి కాగా, ఏ2గా జగన్ పేరు ప్రస్తావించారు. హత్య కిందకు రాని కల్పబుల్ హోమీ సైడ్ సెక్షన్ కింద కేసు రిజిస్టర్ అయ్యింది. అంటే ఒక వ్యక్తికి చావుకు కారణమైనప్పుడు ఆ తరహా సెక్షన్ ఉపయోగిస్తారు. ప్రస్తుతం పల్నాడు పోలీసులు అదే చేశారు. ఈ కేసు నమోదు చేయడానికి ముందు ఆ సెక్షన్‌పై కూలంకుషంగా చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకున్నారు. నిర్లక్ష్యంతో చావుకు కారణమని భావించి బీఎన్ఎస్ 106(1)) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు పోలీసులు. దర్యాప్తులో దొరికిన ఫుటేజీలు ఆధారంగా కల్పబుల్ హోమీసైడేనని నిర్ధారణకు వచ్చారు అధికారులు. చివరకు ఈ సెక్షన్ జత చేశారు.జగన్ సహా మిగతా నిందితులపై ఈ సెక్షన్ పెట్టారు పోలీసుల. నేరం నిరూపణ అయితే ఈ సెక్షన్ కింద జీవిత ఖైదు విధించే అవకాశముందని కొందరు అడ్వకేట్లు చెబుతున్నమాట. నేర తీవ్రతను బట్టి జైలు శిక్ష, జరిమానా రెండూ విధించేందుకు అవకాశముందని అంటున్నారు. ఈ సెక్షన్ పూర్తిగా నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ అని అంటున్నారు. నేరానికి ప్రేరేపించారనే అభియోగంపై బీఎన్ఎస్ 49 సెక్షన్‌ను ఈ కేసులో చేర్చినట్టు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఫుటేజ్ ఉండడంతో అధినేత జగన్‌కు కష్టాలు తప్పవని అంటున్నారు నేతలు, కేడర్. కేసు వేగంగా దర్యాప్తు న్యాయస్థానం ముందుకు వస్తే జగన్‌కు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. మరోవైపు సాక్షి టీవీ డిబేట్‌లో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలిపారు అమరావతి మహిళలు. ఆయనకు మద్దతుగా మాట్లాడిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. 'సాక్షి ఛానల్‌పై కడుపు మంటతో నిరసన వ్యక్తం చేస్తున్నారని చెబుతూనే మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతేకాదు అమరావతి మహిళలను పిశాచులు, రాక్షసులు, రెండు కలిసిన సంకరజాతికి చెందినవారుగా వర్ణించారు. ఆ తెగకు చెందినవారిగా కనిపిస్తున్నారని, అలాంటి వారు మాత్రమే చేస్తారని' వ్యాఖ్యానించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతినేలా సజ్జల వ్యాఖ్యలు చేశారని భావించింది మాదిగ కార్పొరేషన్. ఆ సంస్థ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళలను హేళన చేయడంతోపాటు వారి పుట్టుకను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఒకేరోజు అధినేత, కీలక నేతపై కేసులు నమోదు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతోంది కేడర్.

# బలహీనత ఇబ్బంది పెడుతుందా?

ప్రస్తుత కాలంలో సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరం బలహీనతకు గురవుతుంది. బలహీనత వల్ల ఏ పని కూడా సక్రమంగా చేయలేం ఏకాగ్రత పూర్తిగా దెబ్బ తింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తేలికగా జీర్ణమయ్యేవి, శరీరానికి శక్తి లభించే వాటిని ఎప్పుడూ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత కాలంలో సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరం బలహీనతకు గురవుతుంది. బలహీనత వల్ల ఏ పని కూడా సక్రమంగా చేయలేం ఏకాగ్రత పూర్తిగా దెబ్బ తింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తేలికగా జీర్ణమయ్యేవి, శరీరానికి శక్తి లభించే వాటిని ఎప్పుడూ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో బలహీనతకు కారణం: విటమిన్ బి12 లేకపోవడం వల్ల శరీరంలో బలహీనత ఏర్పడుతుంది. డిప్రెషన్, ఆందోళన కూడా శరీరాన్ని బలహీనం చేస్తాయి. ఇది ఏదో ఒక రకమైన వ్యాధి వల్ల కూడా ఇలా జరుగుతుంది. శరీరంలో బలహీనత ఉంటే ఆహారంలో వీటిని జోడించండి. పచ్చి కూరగాయలు తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు. ఫైబర్ కూరగాయలలో లభిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. దీంతో పొట్ట త్వరగా నిండడంతో పాటు ఆకలిని ఎక్కువసేపు అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గుతుంది. ఊబకాయం పెరగదు. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో పచ్చి కూరగాయలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. లీన్ ప్రొటీన్ తీసుకోండి: శరీర బలహీనతను తొలగించడానికి లీన్ ప్రొటీన్లు అధికంగా ఉండే వాటిని తీసుకోవాలి. దీని కోసం ఆహారంలో సముద్రపు (చేపలను) ఆహారాలను, మాంసం, గుడ్లు వంటి వాటిని చేర్చుకోవచ్చు. ఇంకా ఆకుకూరలు, పెరుగు, కాయధన్యాలను తీసుకోవచ్చు. లీన్ ప్రోటీన్ గుండెకు చాలా మంచిది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నట్స్, తృణ ధాన్యాలు తినండి: శరీరంలో బలహీనత ఉన్నప్పుడు నట్స్, తృణ ధాన్యాలు తినవచ్చు. ఎందుకంటే వీటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. దీని కారణంగా అవి సులభంగా జీర్ణమవుతాయి. మరోవైపు ప్రతిరోజూ నట్స్, తృణ ధాన్యాలును తీసుకుంటే మీ బలహీనత, అలసట తొలగిపోతుంది.



## బార్లీ నీళ్లు తాగితే కొలెస్ట్రాల్ ప్రాబ్లమ్ పరార్..!

బార్లీ వాటర్‌తో బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార, ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఫోలేట్ (ఒక%దీ విటమిన్), ఇనుము, రాగి, మాంగనీస్ అధికంగా ఉన్నాయి. ఇవన్నీ శరీరంలోని అవయవాలపై ఆక్సీకరణ ఒత్తిడిని కలిగించే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తూ ఆరోగ్యకరమైన కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా ఇది శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్?ను తగ్గించడానికి చక్కటి ఔషధంలా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. బార్లీ వాటర్‌లోని ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియ ప్రక్రియను మెరుగు చేస్తుంది. త్వరగా ఆకలి వేయకుండా ఎక్కువ టైమ్ కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. అతిగా తినకుండా నిరోధిస్తుంది.



ఆరోగ్యకరమైన ఆహారంతో పాటుగా, వ్యాయామం చేస్తూ బార్లీ నీరు తీసుకోవటం ఈజీగా బరువు తగ్గొచ్చు అంటున్నారు నిపుణులు. బార్లీలోని ఫ్రీ–రాడికల్ లక్షణాలతో పాటు, విటమిన్లు, మినరల్స్ రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఇందులోని ఫైబర్, పేగు కదలికలకు, జీర్ణక్రియకు సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి బార్లీ నీటిలో కరిగే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. బార్లీ నీరు రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. బార్లీ నీరు తక్కువ గ్లైసెమిక్ కలిగి ఉంటుంది. ఇది మధుమేహం ఉన్నవారికి ప్రయోజనకంగా ఉంటుంది. బార్లీ నీరు రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. బరువు తగ్గేందుకు కూడా బార్లీలోని ఫైబర్ కంటెంట్ సహాయపడుతుంది. ఇది క్యాలరీలను తగ్గించేందుకు, బరువును తగ్గించేందుకు ముందుంటుంది. బార్లీ నీరు మూత్రపిండాలలో రాళ్లకు సహజ నివారణగా ఉపయోగపడుతుంది. ఎముకల ఆరోగ్యానికి బార్లీలోని కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు సహకరిస్తాయి. పోషకాలతో నిండిన బార్లీ నీటిని తీసుకోవడం వల్ల హైడ్రేటెడ్‌గా ఉండటానికి వీలుంటుంది. దీనిలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచడానికి తోడ్పడుతుంది. బార్లీలో ఫెరులిక్ యాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో కణతులు పెరగకుండా చేస్తుంది. బార్లీలో లభించే యాంటీఆక్సిడెంట్ల ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్ కణాలు పునరుత్పత్తి జరగకుండా నిరోధిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బార్లీ శరీరంలో అధిక నీటిని తొలగిస్తుంది. మూత్ర సంబంధ సమస్యలను కూడా అదుపులో ఉంచుతుంది.

## గింజ గింజలో ఆరోగ్యం.. అద్భుత ప్రయోజనాలు



వేసవి కాలంలో విరివిగా లభించే పుచ్చపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఎండలో దాహార్తిని తీర్చేందుకు ముందు వరుసలో ఉంటుంది పుచ్చపండు. అయితే, మనందరం ఈ పండు తినేసి గింజలు ఊసేస్తాం. కానీ, అది చాలా పొరపాటు అంటున్నారు నిపుణులు. ఎందుకంటే పుచ్చకాయ గింజలు అంత రుచిగా ఉండకపోయినా గుండె ఆరోగ్యానికి చాలా మంచిదని చెబుతున్నారు. పుచ్చపండులోని నీరు శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. మూత్రపిండాలు, మూత్రనాళాల్లో ఇబ్బందులు ఉన్నవారికి పుచ్చపండు ఓ వరం లాంటిదని నిపుణులు చెబుతున్నారు.. భోజనం తర్వాత పుచ్చపండు రసం తాగడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఊబకాయాన్ని తగ్గించడంలో ఇది ఎంతో తోడ్పడుతుంది. పుచ్చపండు గింజల్లో విటమిన్స్‌తో పాటు మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, పాస్పరస్, కాపర్, జింక్, మాంగనీస్ సమృద్ధిగా ఉంటాయి. ఈ గింజల్లో ఉండే ఆమైనో ఆసిడ్స్ రక్తనాళాలను వెడల్పు చేసి రక్తప్రసరణ సాఫీగా జరిగేలా చేస్తాయి. పుచ్చగింజల్లో ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. పుచ్చపండులో విటమిన్ ఎ, బి, సి, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి..పుచ్చకాయ గింజలలో కాల్షియం కూడా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన ఎముకలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఎముకలు కాకుండా, కండరాల పనితీరును పెంచడంలో, నరాలను చురుకుగా ఉంచడంలో ఉపయోగకరంగా ఉంటుంది. పుచ్చకాయలో ఉండే లైకోపీన్ అనే పదార్థం పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తిని పెంచుతుంది. పుచ్చకాయ గింజల్లో ఉండే లైసిన్ మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. అంతేకాదు.. పుచ్చకాయ గింజల్లో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది.. ఇది లైకోపీన్ వల్ల క్యాన్సర్ కణాలను నియంత్రిస్తుంది. మెదడు నరాలను బలపరుస్తుంది. కామెర్లు వంటి సమస్యలలో పుచ్చకాయ గింజలను తీసుకోవడం వల్ల చాలా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ గింజల్లో ప్రొటీన్, ఐరన్, మెగ్నీషియం, జింక్, కాపర్ పుష్కలంగా ఉంటాయి.. ఇవి జుట్టు నాణ్యతను మెరుగుపరుస్తాయి. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు రాలడం, డ్యామేజ్‌ని నిరోధించడంలో సహాయపడతాయి. తరచూ పుచ్చకాయ గింజలు తినటం వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది. ముడతలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. చర్మం

# మధుమేహానికి దివ్య ఔషధం ఈ పండు..

ఎరుపు అరటి.. షుగర్ బాధితులకు దివ్య ఔషధం ఈ పండ్లు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇందులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు నిండివున్నాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణ అరటి కంటే ఎరుపు అరటి పండులో ఎక్కువ పోషకాలు ఉన్నాయని అంటున్నారు. ఎరుపు అరటిలో బీటా కెరోటిన్, విటమిన్ సి, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల మధుమేహంతో పాటుగా శరీరానికి మరెన్నో లాభాలు కలుగుతాయని చెబుతున్నారు. ఎరుపు అరటి పండును తరచూ తీసుకోవటం వల్ల కంటిచూపును మెరుగుపరుస్తుందని నిపుణులు అంటున్నారు. దృష్టి లోపాలను నివారిస్తుంది. మహిళల్లో ఎక్కువగా వచ్చే రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. నరాలను బలపరుస్తుంది. అంతేకాదు..కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడుతుంది.




ఎరుపు రంగు అరటి పండు తరచూ తీసుకోవటం వల్ల అజీర్తి, పైల్స్, దృష్టి లోపాలను తొలగిస్తుందని నిపుణులు చెబుతున్నారు.. రోజుకు ఓ అరటి పండును 21 రోజుల పాటు తీసుకుంటే దృష్టి లోపాలతో పాటు విటమిన్ సి లోపం తొలగిపోతుంది. ఎరుపు అరటితో జీర్ణక్రియ మెరుగవుతుంది. శరీరానికి శక్తిని ఇస్తుంది, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎరుపు రంగు అరటి పండ్లకు పంటి నొప్పులను దూరం చేసే గుణం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఛాతిలో మంటతో ఇబ్బంది పడేవారు.. రోజుకో ఎరుపు అరటిని తీసుకోవచ్చునని సూచిస్తున్నారు. దీంతో ఛాతి, కడుపులో మంట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా సంతానలేమి సమస్యలను తగ్గించడంలో ఎరుపు అరటి పండు అద్భుత మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. ఎరుపు రంగు అరటిలో ఐరన్, క్యాల్షియం అధికం. సంతానం కోసం ఎదురుచూసే దంపతులు రోజు ఓ ఎరుపు అరటిని తీసుకుంటే శరీరంలో జీవకణాల ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా గర్భం దాల్చడం సులభం అవుతుందని అంటున్నారు. ఎరుపు అరటి పోషకాల గని అయినప్పటికీ, కొంతమంది వ్యక్తులు దీన్ని జాగ్రత్తగా తీసుకోవడం మంచిది. ముఖ్యంగా షుగర్ పేషెంట్స్. అరటిపండులో చక్కెర పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారు దీన్ని తీసుకోవడానికి ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. మలబద్ధకం ఉన్నవారు, కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవటం ఉత్తమం.

## పుల్లగా ఉందని దూరం పెడుతున్నారా.?

బరువు తగ్గించేందుకు తీసుకునే ఆహారాల్లో చింతపండు ఉందని నిపుణులు చెబుతున్నారు. తరుచుగా చింతపండును తీసుకుంటే చాలా తొందరగా బరువు తగ్గుతారని చెబుతున్నారు. చింతపండు లేనిదే భారతీయ వంటకాలు పూర్తి అవ్వవు. పుల్లగా ఉండే ఈ చింతపండులో ఎన్నో ఔషద గుణాలున్నాయని నిపుణులు వివరిస్తున్నారు. చింతపండులో మంచి కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు ఇ, కె, సి, బి1, బి2, బి5, బి3, బి6 తో పాటుగా సోడియం, ఐరన్, ఎనర్జీ, జింక్, ఫాస్పరస్, కాల్షియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. చింతపండులో ఉండే హైడ్రక్సీ సిట్రిక్ యాసిడ్ మనలో ఫ్యాట్ ప్రొడక్షన్ను తగ్గిస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే హెచ్‌సీఏ ఫ్యాట్ నిల్వలకు కారణమయ్యే ఎంజైమ్స్‌కు అడ్డుగా నిలుస్తుంది. చింతపండు తీసుకొంటే వ్యాయామం చేస్తున్నప్పుడు కొవ్వు తొందరగా కరిగేందుకు కూడా ఇది ఎంతో సహాయపడుతుందట. బరువు తగ్గాలనుకొంటే తప్పకుండా ప్రతిరోజూ దీని తీసుకోండి. చింతపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుంది. బాడీలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను కూడా తగ్గిస్తుంది. అంతేకాదు ఈ చింతపండు గుండె ఆరోగ్యానికి ఎంతో సహాయపడుతుంది. చింతపండును రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. చింతపండులో పాలీఫెనాల్స్, ఫ్లైవనాయిడ్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. అంతేకాదు దీనితో మెటబాలిజం కూడా పెరుగుతుంది. తద్వారా ఆకలి చాలా వరకు తగ్గుతుంది. దీంతో మీరు ఈజీగా వెయిట్ లాస్ అవుతారు.





# జస్ట్ ఎంజాయ్ బాస్.. కంగారు ఎందుకు అంటున్న ముద్దుగుమ్మ

ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండటం తప్పు లేదు గానీ.. ఆ గోలలో పడి పర్సనల్ లైఫ్ ఎంజాయ్ చేయడం మరిచిపోతుంటారు హీరోయిన్లు. అవకాశాలు వస్తున్నాయి కదా అని.. అస్సలు రెస్ట్ తీసుకోరు. కానీ తాను మాత్రం ఆ టైప్ కాదంటున్నారు జాన్వీ కపూర్. లండన్ వీధుల్లో ఈ భామ రచ్చకు సోషల్ మీడియా అంతా షేక్ అయిపోతుంది. చేసిందే ఒక్క సినిమా.. కానీ తెలుగులో కావాల్సినంత గుర్తింపు తెచ్చుకున్నారు జాన్వీ కపూర్. దేవర సినిమాలో తంగం పాత్రతో బాగానే చేరువయ్యారు ఈ బ్యూటీ. ప్రస్తుతం రామ్ చరణ్ పెద్ది సినిమాలో నటిస్తున్నారు. బాలీవుడ్ కంటే తెలుగులోనే ఈ భామకు మంచి ఆఫర్స్ వస్తున్నాయి. పెద్దితో టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ లిస్టులో చేరిపోవాలని చూస్తున్నారు జాన్వీ. పెద్ది సెట్స్‌పై ఉండగానే.. అల్లు అర్జున్, అట్లీ సినిమాలోనూ జాన్వీకి ఆఫర్ వచ్చినట్లు తెలుస్తుంది. ఇందులో మృణాళ్, దీపికతో కలిసి నటించబోతున్నారు జాన్వీ. మరోవైపు హిందీలోనూ బిజీగానే ఉన్నారు ఈ భామ. కెరీర్‌లో ఇంత బిజీగా ఉన్నా.. పర్సనల్ లైఫ్ మాత్రం మిస్ అవ్వరు ఈ బ్యూటీ. తాజాగా లండన్‌లో చెల్లి ఖుషీ, బాయ్ ఫ్రెండ్ శిఖర్ పహారియాతో కలిసి ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు జాన్వీ.కొన్నేళ్లుగా శిఖర్ పహారియాతో డేటింగ్ చేస్తున్నారు జాన్వీ. ఈ మధ్య ప్రియుడుతో కలిసి లండన్ వెళ్లారు జాన్వీ. ఈ ఇద్దరి ఫోటోలు వైరల్ అవుతున్నాయిప్పుడు. ఓవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరోవైపు పర్సనల్ లైఫ్‌కి ఇవ్వాల్సిన టైమ్ ఇస్తున్నారు జాన్వీ. ఈ బ్యాలెన్సింగ్ చాలా మంది హీరోయిన్లకు రాదు.. అందులో త్వరగానే ఆరితేరిపోయారు జాన్వీ కపూర్.

# విశ్వంభర పాటకు హీరోయిన్





విశ్వంభరలో బ్యాలన్స్ ఉన్న ఒకే ఒక్క ఐటెం సాంగ్ కు సమస్య తీరిందని లేటెస్ట్ అప్డేట్. ఏవేవో ఆప్షన్లు చూస్ చివరికి శాండల్ వుడ్ భామని లాక్ చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. తన పేరు నిష్విక నాయుడు. మనకు పరిచయం లేదు కానీ కన్నడ సినిమాలు ఫాలో అయ్యేవాళ్ళు గుర్తుపడతారు. బిచ్చగాడు శాండల్ వుడ్ రీమేక్ అమ్మ ఐ లవ్ యుతో 2018లో వచ్చిన నిష్విక ఇప్పటిదాకా తొమ్మిదికి పైగానే సినిమాలు చేసింది. గత ఏడాది శివరాజ్ కుమార్, ప్రభుదేవాల కరటక దమనకలో నటించింది. పుట్టి పెరిగింది, చదివింది అంతా బెంగళూరులోనే అయినా ఈ అమ్మాయి కుటుంబం మూలాలు తెలుగులోనే ఉన్నాయి. మరి పెద్దగా పాపులారిటీ లేని అమ్మాయిని ఎంచుకోవడం వెనుక దర్శకుడు వశిష్ఠ స్ట్రాటజీ ఏంటో అర్థం కావాలంటే సాంగ్ చూసే దాకా వెయిట్ చేయాలి. ఈ ఒక్క పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేస్తున్నాడు. ఇది కూడా అఫీషియల్ గా చెప్పలేదు. టీమ్ దాచిపెడితే లీకైపోయింది. అయినా సరే యువి క్రియేషన్స్ సమర్థిస్తూ, ఖండిస్తూ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికీ విపరీతమైన ఆలస్యానికి గురైన విశ్వంభర విడుదల వ్యవహారం త్వరలోనే కొలిక్కి రావోచ్చుట. అమెజాన్ ప్రైమ్ కు ఓటిటి, జీ ఛానల్ కు శాటిలైట్ ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది ఇంకా ఖరారుగా తెలియాల్సి ఉంది. జూలై రాదనే క్లారిటీ వచ్చేయడంతో విశ్వంభరకున్న నెక్స్ట్ ఆప్షన్ ఆగస్ట్. మొదటి రెండు వారాల్లో కింగ్ డమ్, వార్ 2, కూలీ ఉన్నాయి. చివరి వారంలో రవితేజ మాస్ జాతర ఉంది. వీటితో మెగా మూవీ తలపడటం డౌటే. మిస్ అయితే మళ్ళీ సెప్టెంబర్ కు వెళ్లాల్సి ఉంటుంది.



# అనుష్క దర్శనం ఇంకెప్పుడు

ఇంకో ఇరవై రోజుల కంటే తక్కువ వ్యవధిలో ఘాటీ విడుదల కానుంది. జూలై 11 రిలీజ్ లో ఎలాంటి మార్పు లేదని యువి క్రియేషన్స్ స్పష్టం చేస్తున్న నేపథ్యంలో అభిమానులు అలెర్ట్ అయిపోయారు. అయితే ఇటీవలే విడుదల చేసిన మొదటి లిరికల్ సాంగ్ లో అనుష్కను చూపించి చూపించకుండా కేవలం రెండు షాట్లకు పరిమితం చేయడం పట్ల ఫ్యాన్స్ అసంతృప్తిగా ఫీలవుతున్నారు. విక్రమ్ ప్రభుతో తన పెళ్లి జరుగుతున్న పాటగా ప్రొజెక్ట్ చేయడం వరకు బాగానే ఉంది. కానీ కనీసం క్లోజ్ అప్ లో ఒక్క పిక్ చూపించకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అసలు ఎందుకిలా డిజైన్ చేశారనే అనుమానం కలుగుతోంది. టైం చాలా పరిమితంగా ఉండటంతో ఘాటీ ప్రమోషన్ల స్పీడ్ పెంచాలి. టైటిల్ రోల్ అనుష్కనే కాబట్టి మీడియా ముందుకు రావాల్సి ఉంటుంది. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి టైంలో ఏదోలా మేనేజ్ చేశారు కానీ ఈసారి అదే రిపీట్ చేస్తారా అనే డౌట్ లేకపోలేదు. ఆ సినిమా రిలీజ్ టైంలో వీడియో బైట్స్ తప్ప అనుష్క తానుగా ఇంటర్వ్యూలు ఇవ్వడం, ఈవెంట్ కు రావడం లాంటివి చేయలేదు. ఇప్పుడు ఘాటీ విషయంలో కూడా ఇలాగే చేస్తుందా అంటే ఏమో ఇప్పుడే చెప్పలేం. దర్శకుడు క్రిష్, డాన్స్ మాస్టర్ సుందరం మాస్టర్ కనిపించినంత సేపు కూడా పాటలో అనుష్కని చూపించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. సరే ఇదంతా ఎలా ఉన్నా ఘాటీకి ప్రస్తుతానికి పెద్ద బజ్ లేదు. దాన్ని పెంచాలి. ఇప్పటికే పలు వాయిదాల వల్ల హైప్ తగ్గింది. అప్పుడెప్పుడో చిన్న టీజర్ తో ఆసక్తి పెంచారు కానీ తర్వాత సైలెంట్ అయ్యారు. గంజాయి వ్యాపారంతో మాఫియా డాన్ గా మారిన ఒక మహిళ బయోపిక్ గా రూపొందిన ఘాటీలో యాక్షన్ ఎలిమెంట్స్ చాలానే ఉన్నాయట.



# కన్నప్ప సెన్సార్ పూర్తి.. రన్ టైమ్ కాస్తా ఎక్కువే!

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న కన్నప్ప రిలీజ్‌కు అంతా సిద్ధమైంది. ఈ నెల 27న థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే రిలీజైన పాటలు, ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ మూవీలో ప్రభాస్‌తో పాటు మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి సూపర్ స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. దీంతో ఈ సినిమాపై ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా కన్నప్ప మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ మూవీ రన్‌టైమ్ దాదాపు 182 నిమిషాలు కాగా.. అంటే మూడు గంటల రెండు నిమిషాలుగా ఉంది. మైథలాజికల్ నేపథ్యంలో వస్తోన్న మూవీ కావడంతో రన్‌టైమ్ కాస్తా ఎక్కువగానే ఉంది. 195 నిమిషాల నిడివితో ఈ సినిమాను తెరకెక్కించగా.. సెన్సార్ బోర్డ్ 12 కట్స్ చెప్పింది. సీబీఎఫ్‌సీ నిబంధనల ప్రకారం చిత్రం మార్పులకు అంగీకరించింది. రాబందు ఓ చిన్నారిని పై నుంచి పడేయటం.. తిన్నడుకు సంబంధించిన కొన్ని సీన్స్, మూడు పాటల్లోని విజువల్స్‌ను తొలగించారు. మరోవైపు కన్నప్ప అడ్వాన్స్ బుకింగ్స్ రేపటి నుంచి మొదలవుతాయని మంచు విష్ణు ట్వీట్ చేశారు. ఇప్పటికే ఓవర్‌సీస్‌లో బుకింగ్స్ ఓపెన్ కాగా.. తెలుగు అభిమానులకు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయని విష్ణు వెల్లడించారు. ఈ సినిమాకు ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. కృష్ణంరాజు నటించిన భక్త కన్నప్ప సినిమా తర్వాత దాదాపు 50 ఏళ్లకు మరోసారి కన్నప్ప కథ రావడంతో ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేసింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.